
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 17 మే 2025

ఇసుక సరఫరాలో గోల్‌మాల్?

సెంటు స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరా

ప్రతి ఇంటికి నాలుగు విడతలుగా 20 టన్నులు..

- సుమారు ఐదారు టన్నుల ఇసుక పక్కదారి!
- కాంటాక్టర్లతో పలువురు హౌసింగ్ అధికారుల మిలాఖత్..
- రూ. 1.8 లక్షల యూనిట్ ఇంటికి ప్లాస్టింగ్ లేకుండానే ఇసుక వినియోగం
- ఇసుక వాడకంపై నిగ్గు తేల్చాలని హెచ్చరించిన ఉన్నతాధికారి

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి):

నగర శివార్లలో సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేసే ఇసుకలో భారీ గోల్‌మాల్ జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక ఇంటికి 20 టన్నుల ఇసుక సరఫరా చేస్తే అందుల్లో సుమారు ఐదారు టన్నులు పక్కదారి పడుతుందనే ఫిర్యాదులున్నాయి.

అవసరానికి మించి సరఫరా చేసే ఇసుకను కొందరు కాంట్రాక్టర్లు బయటకు తరలిస్తున్నారు. చాలాకాలంగా సాగుతున్న ఈ దందాపై జిల్లా స్థాయిలో హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదు సరికదా కాంట్రాక్టర్లతో మిలాఖత్ అయ్యారనే వాదన వినిపిస్తోంది. అయితే వారం, పది రోజుల క్రితం జిల్లాకువచ్చిన హౌసింగ్ ఉన్నతాధికారి ఒకరు జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఇసుక సరఫరాలో భారీగా తేడాలున్నాయని, వినియోగం లెక్కలు తేల్చకపోతే ఇబ్బందులు పడతారని హెచ్చరించడంతో అందరు అవాక్కయ్యారు.

నగర శివార్లలో 65 లేఅవుట్లలో 98,212 ఇళ్లు నిర్మిస్తున్నారు. లబ్ధిదారులకు బదులు కాంట్రాక్టర్లే ఇళ్లు నిర్మిస్తున్నారు. సెంటు స్థలంలో నిర్మించే ఇంటికి





ప్లాస్టింగ్ చేసిన ఇల్లు


ప్లాస్టింగ్ చేయని ఇల్లు

కేంద్రం పీఎంఎవై కింద రూ.1.8 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో నిర్మించే ఇళ్లకు తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయరు.. ఇంటి ముందు వైపుగా గోడను మాత్రమే ప్లాస్టింగ్ చేసి లబ్ధిదారునికి అప్పగిస్తారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులగా ఉండే లబ్ధిదారులకు ఓ ఇంటి కోసం బ్యాంకు ఇచ్చే రూ.35 వేల రుణం సదరు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఈ సొమ్ము కూడా కాంట్రాక్టరుకు ఇస్తే ఇంటికి తలుపులు, కిటికీల ఏర్పాటుతో పాటు నాలుగు వైపులా గోడలు, లోపల, ఫ్లోరింగ్‌కు ప్లాస్టింగ్ చేసి ఇస్తారు. ఇందుకు అనుగుణంగా లక్ష మంది లబ్ధిదారుల్లో 32 వేల మందికి డ్వాక్రా రుణం కింద రూ.35 వేల వంతున చెల్లించారు.

ఇదిలావుండగా ఇళ్ల నిర్మాణాలకు గాను ప్రతి ఇంటికి ప్రభుత్వం ఇసుక, సిమెంటు, ఐరన్ సరఫరా చేస్తోంది. శ్రీకాకుళం, రాజమండ్రిల్లో గల నదుల రీచ్‌ల నుంచి ఇసుకను జిల్లాలోని అన్ని లేఅవుట్లకు సరఫరా చేస్తున్నారు. ప్రతి ఇంటికి నాలుగు దఫాలలో ఐదు టన్నుల వంతున 20 టన్నుల ఇసుక ఇస్తున్నారు. పునాదులు తీసే ముందు ఐదు టన్నులు, గోడలు నిర్మించేటప్పుడు ఐదు టన్నులు, శ్లాబ్ వేయడానికి ఐదు టన్నులు, ప్లాస్టింగ్‌కు ఐదు టన్నుల వంతున ఇవ్వాలన్నది ప్రతిపాదనల్లో ఉంది. ఇప్పటిరకు వరకు సుమారు 38 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వగా, ఈ నెలాఖరు నాటికి మరో 13,095 ఇళ్లను పూర్తి చేసేందుకు లక్ష్యంగా ... మిగతా 6వ పేజీలో

సీల్డ్ కవర్‌లో డిప్యూటీ మేయర్ పేరు!

అభ్యర్థి ఖరారు బాధ్యత చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లదే..





నలుగురి పేర్లను ప్రతిపాదించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి):

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఎంపికకు సంబంధించి సీల్డ్ కవర్ సంస్కృతిని అమలు చేయనున్నారు. డిప్యూటీ మేయర్ పోస్టు కోసం టీడీపీ, జనసేన మధ్య గట్టిపోటీ నెలకొనడంతో రెండు పార్టీల అధినేతల సూచన మేరకు అభ్యర్థి పేరును సీల్డ్ కవర్‌లో విశాఖకు పంపనున్నారు. డిప్యూటీ మేయర్‌గా ఎవరిని ఎంపిక చేయాలన్నది విశాఖలోనే తేల్చుకోవాలని ఎమ్మెల్యేలకు, మేయర్‌కు మూడు రోజుల క్రితమే సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ జనసేన పార్టీ గట్టిగా పట్టుబట్టడంతో ఎంపిక అనేది తేలికగా అయ్యే పని కాదని టీడీపీ నేతలకు అర్థమైంది. డీసీసీబీ చైర్మన్ పదవిని జనసేనకు చెందిన కోన తాతారావుకు కేటాయించడంతో డిప్యూటీ మేయర్-1 పదవిని టీడీపీ తీసుకోవాలని ఎమ్మెల్యేలు యోచిస్తున్నారు. అవసరమైతే డిప్యూటీ మేయర్-2 పోస్టును జనసేనకు కేటాయించేలా ఆ పార్టీ నేతలను ఒప్పించాలని భావిస్తున్నారు. ఇదే విషయం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆమోదంతో టీడీపీ నుంచి ఒక పేరును ఎంపిక చేసుకోవాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో టీడీపీ నుంచి గొలగాని మంగవేణి, మొల్లి హేమలత, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు (గాజువాక ఎమ్మెల్యే కాదు) పేర్లతో కూడిన జాబితాను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి అందజేయనున్నారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన మేయర్ పీఠం నుంచి గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాసం పెట్టి ఆమె స్థానంలో పీలా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. అందువల్ల డిప్యూటీ మేయర్ పోస్టును యాదవ సామాజిక వర్గానికి మహిళనే ఎంపిక చేయాలని పలువురు పట్టుబడుతున్నా... నగరంలో మరో బలమైన సామాజిక వర్గమైన కాపుల నుంచి ఒకరికి ఇచ్చి తీరాలనే వాదన బలంగా ఉంది. కాగా ఈ నెల 19న డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనున్నది. ఈ క్రమంలో 18వ తేదీన ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన కార్పొరేటర్లు నగరంలో భేటీ కానున్నారు. ఎన్నిక సమయం కంటే ముందుగానే అధిష్ఠానం నుంచి సీల్డ్ కవర్ రావడం ఖాయమని కీలక నేత ఒకరు స్పష్టం చేశారు.

88 ఎకరాల అభివృద్ధికి జాయింట్ వెంచర్ ప్రాజెక్టు

ఆసక్తి గల సంస్థలు ముందుకు రావాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ పిలుపు

- రియల్ ఎస్టేట్ సంస్థలతో కలిసి నగరంలో రోడ్ షో
- ఆరు నెలల్లో డబుల్ డెక్కర్ మోడల్‌లో మెట్రో రైలు ప్రాజెక్టు పనుల ప్రారంభం



రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమైన వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్. చిత్రంలో కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేశ్, సీయూపీ శిల్ప, తదితరులు ఉన్నారు

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి):

మధురవాడలో వీఎంఆర్డీఏకు చెందిన 87.80 ఎకరాల భూమిని జాయింట్ వెంచర్ కింద అభివృద్ధి చేయడానికి ఆసక్తి కలిగిన సంస్థలు ముందుకురావాలని సంస్థ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ పిలుపునిచ్చారు. దీనిపై వీఎంఆర్‌డీఏ శుక్రవారం రోడ్ షో నిర్వహించింది. ఇందులో క్రెడాయ్, నరెడ్కో, అప్రెడా తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు మాట్లాడుతూ ఖరగ్‌పూర్ నుంచి విశాఖ వరకు బీచ్ కారిడార్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విశాఖలో డబుల్ డెక్కర్ మోడల్‌లో మెట్రో రైలు ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధమైందని, ఆరు నెలల వ్యవధిలో పనులు కూడా మొదలవుతాయన్నారు. దక్షిణ భారతదేశానికి డేటా సెంటర్ సిటీగా మారబోతున్న విశాఖలో అదానీ, గూగుల్ డేటా సెంటర్లకు కేవలం కిలోమీటరు దూరంలోనే వీఎంఆర్డీఏ భూమి ఉందని, అందులో కన్వెన్షన్ సెంటర్లు, రెసిడెన్షియల్, హోటళ్లు, వాణిజ్య సముదాయాలు నిర్మించుకోవచ్చన్నారు. ఇది ఐటీ పార్కుకు, భోగాపురం విమానాశ్రయం చాలా సమీపంలో ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తగిన ప్రతిపాదనలతో ముందుకువస్తే ... మిగతా 6వ పేజీలో

ఆ 88 ఎకరాల్లోనే ఫిన్‌టెక్ సిటీ!

- జూన్ మొదటి వారంలో టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం
- రూ.2 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాకు ఐటీ మేనేజర్ ఎక్కడ?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో కొత్తగా మరో ఫిన్‌టెక్ సిటీని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మధురవాడలో వీఎంఆర్డీఏకు చెందిన 88 ఎకరాల స్థలంలో దీనిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ భూమిని జాయింట్ వెంచర్ కింద అభివృద్ధి చేయాలని వీఎంఆర్డీఏ రోడ్ షోలు నిర్వహిస్తోంది. ఇందులో పేర్కొన్న ఐటీ సిటీలో ఫిన్‌టెక్ సిటీ ఒక భాగమని జిల్లా అధికారులు శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వాస్తవానికి 2018లోనే రుషికొండ ఐటీ పార్కులోని 'మహతి టెక్నాలజీ' భవనంలో ఫిన్‌టెక్ సిటీని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారు. పేటీఎం వంటి సంస్థలను తీసుకువచ్చారు. ఆ తరువాత ఆయన విశాఖను 'క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్స్' ... మిగతా 6వ పేజీలో

తారెత్తించిన భానుడు

- ఉక్కపోత, వేడితో ఆపసోపాలు పడిన నగరవాసులు

ఫ్రైడే!

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి):

భానుడు తారెత్తించడంతో శుక్రవారం నగరవాసులు విలవిల్లాడిపోయారు. ఉదయం ఏడు గంటల నుంచి సూరీడు తన ప్రతాపాన్ని చూపడం ప్రారంభించేశాడు. ఎండ తీవ్రత సాయంత్రం ఐదున్నర వరకు కొనసాగడంతో ప్రజలు బయటకు రావడానికే భీతిల్లిపోయారు. భగభగలాడిన ఆదిత్యుడి దెబ్బకు నగరంలోని రహదారులపై వాహనాల రాకపోకలు తగ్గిపోవడంతో మధ్యాహ్న సమయానికి అనేక ప్రాంతాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారంతా ఎండ దెబ్బకు బెంబేలెత్తిపోయారు. ఎండతోపాటు ఉక్కపోత కూడా ఉక్కిరిబిక్కిరి చేయడంతో ఇళ్లల్లో ఉన్న ప్రజలు సైతం అల్లాడిపోయారు. భానుడి తాపం నుంచి కాస్తయినా ఉపశమనం పొందేందుకు అత్యధికులు చల్లని పానీయాలను తాగేందుకు ఆసక్తి చూపారు. వాహనదారులు, పాదచారులు ఎండదెబ్బ తగలకుండా ఉండేందుకు గొడుగులు, ముఖానికి క్లాత్‌లు, మహిళలు, యువతులు చున్నీలు ... మిగతా 6వ పేజీలో





ముఖాలకు క్లాత్, చున్నీ చుట్టుకున్న దృశ్యం



ఎండదెబ్బ నుంచి ఉపశమనం పొందాలంటే నీరు తాగాల్సిందే..

ఇక బస్టాపుల్లోనే పార్శిళ్ల బుకింగ్

లాజిస్టిక్ విధానంలో కొత్త ప్రక్రియకు ఆర్టీసీ యాజమాన్యం శ్రీకారం

- జూన్ 1 నుంచి అందుబాటులోకి..
- తొలుత దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సుల్లో అమలు
- యూటీఎస్ టెక్నాలజీ వినియోగంపై బస్సు డ్రైవర్లకు శిక్షణ

ద్వారకాబస్‌స్టేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ లాజిస్టిక్స్‌లో పార్శిళ్లు బుక్ చేయాలంటే ఆయా బుకింగ్ కేంద్రాలకు లేదా ఆథరైజ్డ్ ఏజెన్సీల కార్యాలయాలకు వెళ్లాలి. ఇప్పటివరకు పార్శిళ్ల బుకింగ్ విధానం ఇలాగే జరుగుతుంది. అయితే ఇది వినియోగదారులకు కాస్త అసౌకర్యంగా ఉంటుంది. దీనిని గుర్తించిన ఆర్టీసీ యాజమాన్యం పార్శిళ్ల బుకింగ్ విధానాన్ని సరళీకృతం చేస్తూ కొత్త విధానానికి శ్రీకారం చుడుతుంది.

వినియోగారులకు అందుబాటులో ఉండే బస్టాపుల్లోనే పార్శిళ్లను బుక్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తుంది.



ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఉపయోగించనున్న యూటీఎస్ మిషన్

సంబంధిత బస్సుల డ్రైవర్లే పార్శిళ్లను బుక్ చేసుకుని, అందుకు సంబంధించిన రశీదును కూడా ఇస్తారు. అదే బస్సు లైవ్ ట్రాకింగ్‌లో ఉంటుంది కాబట్టి తమ పార్శిల్ రవాణా సమయాన్ని వినియోగదారులు ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంటుంది. ఇందుకు సంబంధించి యూనిఫైడ్ టికెట్ సొల్యూషన్ (యూటీఎస్) మిషన్ పేరిట సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసింది. ఈ యూటీఎస్ వినియోగంపై డ్రైవర్లకు శిక్షణ కూడా ఇస్తోంది.

తొలుత దూర ప్రాంత సర్వీసుల్లో..

ఈ విధంగా పార్శిళ్ల బుకింగ్ చేసుకునే విధానాన్ని ప్రాథమికంగా దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సుల్లో అమలు చేయాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, బెంగళూరు, చెన్నై, భీమవరం, ఖమ్మం, కర్నూలు, చిత్తూరు వంటి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సుల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. జోనల్ పరిధిలోని రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, పలాస, ఇచ్ఛాపురం, ... మిగతా 6వ పేజీలో

పెరిగిన విద్యుత్ వినియోగం

- అంతరాయం లేకుండా సరఫరా
- ప్రతి శుక్రవారం నిర్వహణ పనులు
- విశాఖలో లోడ్ మానిటరింగ్ సెల్
- ఈపీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్) టీవీ సూర్యప్రకాశ్



టీవీ సూర్యప్రకాశ్, డైరెక్టర్ (ఆపరేషన్స్), ఈపీడీసీఎల్

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి):

వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్నామని ఈపీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్) టీవీ సూర్యప్రకాశ్ తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, వేసవి ఎండల కారణంగా విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని, దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని కొరత రాకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ ... మిగతా 6వ పేజీలో

స్వయంశక్తి సంఘాల తీరుపై ఆరా..

- రేషన్ డిపోల నిర్వహణలో వాటి పాత్రపై వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- కరోనా సమయంలో 60 సంఘాలకు డిపోల కేటాయింపు
- వీటిలో సగానికిపైగా బినామీల చేతుల్లోనే..
- సంఘాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న డీలర్ల సంఘ నేతలు

గాజువాక/అక్కయ్యపాలెం/ఆరిలోవ, మే 16 (ఆంధ్రజ్యోతి):

నగరంలో రేషన్ డిపోలు నిర్వహిస్తున్న స్వయంశక్తి సంఘాల పాత్రపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. స్వయంశక్తి సంఘాలకు కేటాయించిన రేషన్ డిపోలు సగానికి పైగా బినామీల చేతుల్లో ఉన్న విషయంపై ప్రభుత్వానికి ఇటీవల పలు



పౌర సరఫరాల శాఖ కార్యాలయం

ఫిర్యాదులు అందాయి. సంఘంలోని సభ్యులంతా కలిసి డిపో నిర్వహించి ఆర్థికంగా కొంతమేర నిలదొక్కుకునేందుకు వీలుగా కేటాయిస్తే కొందరు వ్యక్తులు మాత్రం వీటిని స్వప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైసీపీ నేతల సిఫారసుతో డిపోలను కేటాయించారు. దీనిపై ఇటీవల కొందరు కూటమి నాయకులు ప్రభుత్వం దృష్టికి.. ప్రధానంగా పౌరసరఫరాల శాఖ మంత్రి వద్ద ప్రస్తావించారు. దీంతో పౌరసరఫరాల కమిషనర్ విశాఖ జిల్లాలో స్వయంశక్తి సంఘాలు నిర్వహిస్తున్న రేషన్ డిపోల గురించి తెలుసుకుంటున్నారు. ఇటీవల రేషన్ డిపో డీలర్ల సంఘ నేతలు విజయవాడలో పౌరసరఫరాల కమిషనర్‌ను కలిసినపుడు పలు అంశాలను ప్రస్తావించారు. ఈ సమయంలో స్వయంశక్తి సంఘాలకు ఎందుకు వత్తాసు పలుకుతున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు పలువురు డీలర్లు పేర్కొంటున్నారు. దీనికి బలం చేకూరేలా తాజాగా రేషన్ డిపో డీలర్ల సంఘ నేతలు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులను కలిసి స్వయంశక్తి సంఘాలకు అనుకూలంగా మాట్లాడడం పట్ల పలువురు డీలర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. డిపోల నిర్వహిస్తున్న స్వయంశక్తి సంఘాలు అక్రమాలకు పాల్పడుతున్నప్పటికీ అటువంటి వారికి ఎలా వత్తాసు పలుకుతారని ప్రశ్నిస్తున్నారు. స్వయంశక్తి సంఘాలకు కేటాయించిన డిపోలను కొందరు బినామీలు నిర్వహిస్తున్నారని, ఇంకా కొందరు బినామీలు ... మిగతా 6వ పేజీలో

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, మే 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. బాలభోగ నివేదన తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు జరిపి షోడశోపచారాలు సమర్పించారు. తొలుత నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

బీవీకే కళాశాలలో సేంద్రీయ మామిడి పండ్ల మేళా

- నేడు, రేపు సాయంత్రం అమ్మకాలు

విశాలాక్షినగర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : సేంద్రీయ మామిడి పండ్ల మేళాను విజయవంతం చేయాలని గోఆధారిత ప్రకృతి రైతుల సంఘం కార్యదర్శి అశోక్ కోరారు. విశాలాక్షినగర్‌లో ఉన్న బీవీకే కళాశాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం సాయంత్రం ఐదు నుంచి ఆదివారం రాత్రి వరకు కళాశాలలో మామిడి పండ్ల మేళా ఉంటుందని, మేళాలో వివిధ రకాల పండ్లు అమ్మకానికి ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు ఆ సంఘం ప్రతినిధులు రుషి, నరేంద్ర, అశోక్, కుమార్, అప్పాజీ, సత్యమధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేవతి కుటుంబీకుల ధర్నా విరమణ

తగరపువలస, మే 16 (ఆంధ్రజ్యోతి) : సంగివలస ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో వైద్యం వికటించి ఎర్రంశెట్టి రేవతి అనే వివాహిత మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు ఆమె కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి నుంచి ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్నారు. మృతురాలిది అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొవ్వూరు గ్రామం కావడంతో ఆ మండల ఎంపీపీ రాజు గురువారం రాత్రి ఆస్పత్రికి వచ్చి యాజమాన్యంతో సంప్రతింపులు జరిపారు. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని ఆస్పత్రి యాజమాన్యం హామీ ఇవ్వడంతో బాధితులు ధర్నా విరమించారు.

అభివృద్ధి పనులు పరిశీలన

సింహాచలం, మే 16 (ఆంధ్రజ్యోతి) : వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆయన వార్డులోని అప్పన్నపాలెం శతకంపట్టు వద్ద జీవీఎంసీ నిధులు రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోన్-8 ఏఈ దుర్గాప్రసాద్, వర్క్సు ఇన్‌స్పెక్టర్ రామారావు, స్థానిక టీడీపీ నాయకులు ఉరుకూటి ఈశ్వరరావు, సారిపిల్లి నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు

భీమునిపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యా సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ఈనెల 12 నుంచి వచ్చేనెల 9వ తేదీ వరకూ ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు భీమిలి భవిత కేంద్రం ఐసీఆర్‌టీ ఉపాధ్యాయిని కెజియా కుమారి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి, వారి పేరును సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేసి, భవిత కేంద్రానికి పంపించాల్సి ఉంటుందన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

ఫ్రైడే!

... 5వ పేజీ తరువాయి

వంటిని కప్పుకుని కనిపించారు. చిన్నారులు, వృద్ధులు భానుడి ప్రతాపానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అత్యవసరమైతే తప్పా బయటకు వచ్చేందుకు సాహసించలేదు. ఉదయం 11 గంటల తరువాత నుంచి పలుచోట్ల వేడి గాలులు వీయడంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు నానాపాట్లు పడ్డారు. ఎండ వేడిమి నుంచి సేదతీరేందుకు ఫ్యాన్లు, ఏసీలను ఎక్కువగా వినియోగించారు. ఆరుబయట పనిచేసేవాళ్లు చెట్ల కిందకు చేరిపోయి ఉపశమనం పొందే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నందున చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వేడి గాలుల నుంచి సేదతీరేందుకు సాయంత్రం ఐదు తరువాత సాగరతీరాలకు చేరుకున్నారు.

డిగ్రీ కళాశాలకు భవన నిర్మాణం

- రూ. 4.5 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఏడాదిలోపు నిర్మాణం పూర్తి కావాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు
- ఎమ్మెల్యే గంటా చొరవతో టెండర్ ప్రక్రియ పూర్తి
- ఆనందంలో మండల ప్రజలు


కళాశాల భవనం నిర్మించనున్న స్థలం

ఆనందపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురంలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఏడాదిలోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్న గడువుతో టెండరు ఖరారు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చీఫ్ ఇంజనీర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డిగ్రీ చదువు కోసం పిల్లలను దూర ప్రాంతాలకు పంపిస్తున్న ఆనందపురం మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీసుకున్న చొరవను పలువురు ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం తగరపువలస కేజీబీవీ స్కూల్‌లో నడుస్తున్న డిగ్రీ కళాశాల, భవన సముదాయం కోసం పీఎం ఉషా పథకం కింద రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. భవన నిర్మాణానికి స్థలం దొరక్కపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయే పరిస్థితి నెలకొంది. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి నిధులు వినియోగానికి గడువు మీరిపోతున్న విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే కలెక్టర్ హరేందిర ప్రసాద్‌తో మాట్లాడారు. ఆనందపురం హైస్కూల్ దగ్గర 5 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న విషయాన్ని చెప్పారు. ఈ కేటాయింపు అనంతరం విద్యా శాఖ ఉన్నతాధికారులతో పలు దఫాలుగా మాట్లాడారు. భవన నిర్మాణం వేగంగా జరగాలని ఎమ్మెల్యే గంటా ఒత్తిడి తేవడంతో కేవలం రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తయ్యి పనులు మొదలు పెట్టే దశకు చేరాయి. మొదటి నాలుగు నెలల్లో 30 శాతం, 8 నెలల్లో 70 శాతం, ఏడాదిలో వంద శాతం పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు ఆ ఉత్తర్వుల్లో అధికారులు నిర్దేశించారు. హైస్కూల్, జూనియర్ కళాశాల సమీపంలోనే డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు కానుండడంతో ఒకే క్యాంపస్‌లో అన్ని దశల విద్యా బోధన అందుబాటులోకి వస్తుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటక శాఖకు భూముల కేటాయింపుపై అభ్యంతరం

- అన్నవరంలో వ్యతిరేకిస్తున్న రైతులు
- రెవెన్యూ అధికారులకు వినతి

భీమునిపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరం గ్రామంలో సర్వే నంబరు 101/1లో వున్న డి.పట్టా భూమిపై కోర్టులో కేసు నడుస్తుండగా, అదే భూమిలో సుమారు 18.70 సెంట్లు పర్యాటక శాఖ బీచ్ రిసార్టుకు కేటాయించడం పట్ల బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వారు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబరు 101/1 వున్న మొత్తం 199.28 సెంట్ల ప్రభుత్వ భూమిలో తమ తాతతండ్రుల నుంచి పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. విజయనగరం జిల్లా ఏర్పడిన తర్వాత భోగాపురం మండలం తూడెం పంచాయతీలో తాము చేరామన్నారు. అన్నవరం, తూడెం గ్రామాలు పక్కపక్కన ఉన్నాయని, గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు భూముల ఆక్రమణకు ప్రయత్నించగా తామంతా ప్రతిఘటించామని చెప్పారు. దీనిపై హైకోర్టును కూడా ఆశ్రయించామన్నారు. కోర్టు స్టేటస్‌కో ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లడం, ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేయించడం జరిగిందన్నారు. విజిలెన్స్ అధికారులు భూముల్లో ఉన్న పంటలను పరిశీలించారన్నారు. అయితే మళ్లీ రెవెన్యూ అధికారులు అదే సర్వే నంబరులో వివాదాస్పదంగా వున్న భూమిలోనే పర్యాటక శాఖకు ఏ 18.70 సెంట్లు కేటాయించడం పట్ల రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి పర్యాటకు శాఖకు కేటాయించిన భూమిని రద్దు చేసి, వివాదం లేని మరో భూమిని కేటాయించాలని రైతులు కోరుతున్నారు.


ఎమ్మెల్సీ నాగబాబును కలిసిన భీమిలి జనసేన నాయకులు

నాగబాబును కలిసిన జనసేన నాయకులు

భీమునిపట్నం (రూరల్), మే 16 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత పనుల మీద నగరానికి వచ్చిన జనసేన రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్సీ కె. నాగబాబును భీమిలి మండల నాయకులు శుక్రవారం ఉదయం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు స్థానికంగా ఉన్న సమస్యలను నాగబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండబాబు, డి. వెంకటేశ్, ఇదిపల్లి నానాజీ, పొట్నూరు శివ ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ముగిసిన ఎఫ్‌డీపీ


కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధకులు

సాగర్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంబెడెడ్ సిస్టమ్స్, 6జి కమ్యూనికేషన్ స్కిల్స్‌పై రెండు రోజులుగా జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎఫ్‌డీపీ) శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎన్‌ఐటీ వరంగల్ ప్రొఫెసర్ మహమ్మద్ ఫరూర్ హష్మి మాట్లాడుతూ ఐఓటీ అప్లికేషన్లు, ఆర్.ఎఫ్ ఇంటి గ్రేటెడ్ సర్క్యూట్లు, సిస్టమ్ డిజైన్ అంశాలపై వివరించారు. అలాగే 5జీ, 6జీ సెల్యూలార్ సిస్టమ్‌ల కోసం వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఛానల్ అంశాలు, సహకార కమ్యూనికేషన్ల అనుకరణ నమూనాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఈసీఈ విభాగం ప్రొఫెసర్ పి. భరణి చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస, మే 16 (ఆంధ్రజ్యోతి) : యోగా, ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మకుమారి సిస్టర్ శివలీల అన్నారు. తగరపువలస అవంతి విద్యా సంస్థలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కోర్కెల సాధన జరగాలంటే మనిషికి ఆత్మవిశ్వాసం ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో కలుషిత గాలి, నీరు, ఆహారం వల్ల అనారోగ్యాలు వస్తున్నాయని, మనుషులు ఆవేశం, చిరాకు వంటి రుగ్మతలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వాటి నుంచి బయట పడడానికి యోగా, ధ్యానం ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం కళాశాల ఛైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సిస్టర్ శివలీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ. చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

ఎండాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిలో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు హెడ్ క్వార్టర్స్ మైదానంలో స్టాఫ్ పరేడ్‌ను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కార్ట్ విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తతో ఉండాలని సూచించారు. తీవ్ర నేరాలకు పాల్పడిన నిందితుల విషయంలో వారి నేర చరిత్రను దృష్టిలో పెట్టుకుని మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. అలానే సిబ్బంది వ్యక్తిగత వినతులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ ఎం. దేవప్రసాద్, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావును ఆదేశించారు. తొలుత ఆయన ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఏ. రాము, ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యారావు, రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, అరవింద్ కిశోర్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సద్గురు సేవాశ్రమం వార్షికోత్సవం

భీమునిపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్‌రోడ్ రామయోగి అగ్రహారంలో ఉన్న సద్గురు సేవాశ్రమం 15వ వార్షిక ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో గురువారం తెల్లవారుజామున కాగడ హారతివే వేడుకలను ప్రారంభించారు. అనంతరం బాబాకు 108 కలశాలతో జలాధివాసం, సుదర్శన హోమం నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ నిర్విరామంగా సాయి నామ పఠనం జరిపారు. అనంతరం నగరానికి చెందిన శృతిలయ సాంస్కృతిక, భక్తి, లలిత సంగీత సేవా సంస్థ అధ్యక్షుడు ప్రభాకరరావు ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి గానామృతం జరిగింది. 17న ఉదయం పది నుంచి నగరానికి చెందిన ఐఈఎల్ శాస్త్రి సంగీత సమితి అధ్యక్షుడు ఆకొండి వెంకటరావు, కార్యదర్శి పిల్లా జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో భక్తి సంగీతలహరి, సాయంత్రం 6 నుంచి జి. మాడుగులకు చెందిన పంచముఖ హనుమ భజన మండలి ఆధ్వర్యంలో హనుమ సేవా భజన జరగనున్నట్టు ఆశ్రమ నిర్వాహకుడు రాజుస్వామి తెలిపారు.

విశాఖలో రైల్వే ఏజీఎం తనిఖీలు

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే అదనపు జనరల్ మేనేజర్ మోహెస్‌కుమార్ బెహరా శుక్రవారం విశాఖలో తనిఖీలు చేశారు. రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఆలిండియా గార్డు కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార్డులు, ఇతర సిబ్బంది నిర్వహించే కీలక బాధ్యతలు, భద్రత వంటి పలు అంశాలపై మాట్లాడారు. రైల్వే యాజమాన్యం చేపట్టాల్సిన చర్యలు, కల్పించాల్సిన సదుపాయాలపై చర్చించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేసిన అనంతరం డీఆర్ఎం కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పరిశుభ్రత, సరుకు రవాణా లోడింగ్, సురక్షితమైన రైలు కార్యకలాపాలు, ట్రాక్ నిర్వహణ వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించడమే కాకుండా తగిన భద్రత, నిర్వహణ చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి రైల్వే బోర్డు నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారామ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నడి రోడ్డుపై వైసీపీ నేత జన్మదిన వేడుకలు

- మాజీ కార్పొరేటర్ హనుమంతురావుతో పాటు మరికొందరిపై కేసు నమోదు

కొమ్మాది, మే 16 (ఆంధ్రజ్యోతి) : నడి రోడ్డుపై పుట్టినరోజు వేడుకలు జరిపి, హంగామా చేసిన వైసీపీ మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్టు పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపారు. గురువారం రాత్రి మధురవాడ ఐటీ సెజ్ మార్గంలోని మ్యాగి కూడలి వద్ద పోతిన హనుమంతురావు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు జరిపారు. రోడ్డుపై కేక్ కట్ చేయడంతో పాటు పెట్రోల్‌తో మంటలు వేసి, బాణసంచా కాల్చడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బందులు పడ్డారు. ఈ దృశ్యాలను కొందరు వీడియో తీసి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి వాట్సాప్‌లో ఫిర్యాదు చేయడంతో తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన పీఎంపాలెం పోలీసులను ఆదేశించారు. సీఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి హంగామా చేస్తున్న వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించారు. సీపీ ఆదేశాల మేరకు హనుమంతురావుతో పాటు మరికొంతమందిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు. వీడియోను పరిశీలించి, మిగిలిన వారిపై కూడా కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

భీమిలిలో అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి


జడ్సీ అయ్యప్పనాయుడును సత్కరిస్తున్న నాయకులు

భీమునిపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సహకరించడంతో పాటు నూతన పనులకు ప్రణాళిక తయారు చేయాలని జోన్‌వన్ కమిషనరు అయ్యప్పనాయుడును టీడీపీ నాయకులు కోరారు. శుక్రవారం వారు జడ్సీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ జోన్‌లో వార్డు సచివాలయాల వ్యవస్థను గాడిలో పెట్టాలన్నారు. అలాగే జోన్ అభివృద్ధికి నూతన ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాలో గోల్‌మాల్?

... 5వ పేజీ తరువాయి

చేసుకున్నారు. మిగిలిన వాటిలో 3,342 ఇళ్లకు పునాదులు తవ్వగా, సుమారు 24 వేల ఇళ్ల పునాదుల వరకు, 20,400 ఇళ్లకు పునాదులు పూర్తి చేయగా..మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కేంద్రం ఇచ్చే పీఎంఏవై నిధులు రూ.1.8 లక్షలతో చేపట్టే ఇళ్లకు ముందు గోడను మాత్రమే ప్లాస్టింగ్ చేస్తారు. దీనికి కూడా ఐదు టన్నుల వంతున ఇసుకను సరఫరా చేస్తున్నారు. అదే డ్వాక్రా సంఘం నుంచి ఇచ్చే రూ. 35 వేలు అందితే మొత్తం ప్లాస్టింగ్ చేస్తారు. దీనికి అనుగుణంగానే ఇసుక సరఫరా చేయాలి. శ్లాబ్ వరకు 15 టన్నులు సరఫరా చేసిన అధికారులు.. మొత్తం ఇళ్ల పూర్తికి మిగిలిన ఐదు టన్నుల సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటివరకు పూర్తిచేసిన 38 వేల ఇళ్లలో రూ.1.8 లక్షలు, రూ.2.15 లక్షలు కేటాయించినవి ఉన్నాయి. ఈ రెండింటికీ ఒకేలా 20 టన్నుల వంతున ఇసుక సరఫరా చేశారు.ఇంటి ముందు గోడ ప్లాస్టింగ్ చేయడానికి ఐదు టన్నుల ఇసుక అవసరం లేదు. అయినా కాంట్రాక్టర్లు ఇండెంట్ పెట్టిన వెంటనే ఇసుక కోసం ఆన్‌లైన్‌లో ఇన్ వాయిస్‌లో జనరేట్ చేస్తున్నారు. మరో విశేషమేమిటంటే.. సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణానికి 13 టన్నుల ఇసుక సరిపోతుందని నగరంలో ప్రైవేటు ఇళ్లు నిర్మిస్తున్న సివిల్ ఇంజనీర్ ఒకరు తెలిపారు. అటువంటిది సెంటు స్థలంలో నిర్మించే ఇంటికి 20 టన్నుల్లో ఐదారు టన్నుల వరకు మిగులుతుందన్నారు. ఇదిలావుండగా రీచ్‌ల నుంచి వచ్చే ఇసుక లోడుల్లో కొన్నింటిని మధ్యలోనే దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక సరఫరా విషయంలో కాంట్రాక్టర్లకు కొందరు ఏఈలు అడ్డగోలుగా సాయపడుతున్నారనే వాదన ఉంది. లేఅవుట్లలో ఇసుక నిల్వలు, వినియోగంపై లెక్కలు తేల్చకుండా కాంట్రాక్టర్లు ఇచ్చిన సొమ్ముతో కొందరు అధికారులు జేబులు నింపుకుంటున్నారనే ఫిర్యాదులున్నాయి. ఇసుక వినియోగంపై వారం, పది రోజుల క్రితం జిల్లాకు వచ్చిన ఉన్నతాధికారి చేసిన హెచ్చరికతో అధికారులు అప్రమత్తం అవుతారా? అనేది అనుమానమేనని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేసే ఇసుక వినియోగంపై సమగ్ర విచారణ చేపడితే గుట్టురట్టు అవుతుందని రిటైర్డు హౌసింగ్ అధికారి వ్యాఖ్యలు చేశారు.

ఆ 88 ఎకరాల్లోనే ఫిన్‌టెక్ సిటీ!

... 5వ పేజీ తరువాయి

సిటీగా ప్రకటించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐటీని పట్టించుకోకపోవడంతో రుషికొండలోని ఫిన్‌టెక్ సంస్థలు ఒక్కొక్కటిగా వెళ్లిపోయాయి. ఇప్పుడు అద్దె భవనాల్లో కాకుండా సొంతంగానే రాష్ట్ర ప్రభుత్వం 'ఫిన్‌టెక్ సిటీ'ని నిర్మించాలని ప్రణాళిక రూపొందిస్తోంది. ఇది కార్యరూపం దాల్చడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

మొదటి వారంలో టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, స్టార్టప్‌లకు అండగా ఉండడానికి 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'ను ప్రభుత్వం అమరావతిలో నెలకొల్పింది. దీనికి అనుబంధంగా మరో ఎనిమిది రీజనల్ కేంద్రాలను ప్రకటించింది. వీటిని అభివృద్ధి చేసే బాధ్యతలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించింది. విశాఖలో రీజనల్ హబ్‌ను జీఎంఆర్ గ్రూపునకు ఇచ్చారు. ఇందుకోసం వీఎంఆర్డీఏ సిరిపురం జంక్షన్‌లో కొత్తగా నిర్మించిన 'ది డెక్' భవనంలో ఒక అంతస్తును కేటాయించారు. దీనికి అవసరమైన మౌలిక వసతుల కోసం తాజాగా ప్రభుత్వం రెండు కోట్ల రూపాయలను విడుదల చేయడంతో ఇంటీరియర్ పనులను ప్రారంభించారు. దీనిని జూన్ మొదటి వారంలో ప్రారంభించే అవకాశం ఉందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి శుక్రవారం తెలిపారు.

జిల్లాకు ఐటీ మేనేజర్ ఏరీ?

ప్రతి జిల్లాలో ఐటీ వ్యవహారాలను పర్యవేక్షించడానికి ఒక మేనేజర్‌ను నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. విశాఖపట్నంలో గతంలో టెక్ మహేంద్రాలో ఏపీటా కార్యాలయం ఉండేది. అధికారులు కూడా ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారిని తొలగించింది. ఆ తరువాత రుషికొండ స్టార్టప్ విలేజ్‌లో జాయింట్ డైరెక్టర్ కేడర్‌లో ఒక మహిళ పనిచేసేవారు. ఆమె కూడా ఇప్పుడు లేరు. ఐటీ సంస్థలకు రావాల్సిన రాయితీ బకాయిల కోసం సంప్రతించడానికి కూడా ఎవరూ లేరు. అందువల్ల తక్షణమే ఒక మేనేజర్‌ను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెరిగిన విద్యుత్ వినియోగం

... 5వ పేజీ తరువాయి

సరఫరాలో ఊహించని ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లకు ప్రతి శుక్రవారం నిర్వహణ పనులు చేపడుతున్నామని, అందులో భాగంగా శుక్రవారం కొన్నిచోట్ల అంతరాయం ఏర్పడిందన్నారు. అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల గురువారం రాత్రి పెనుగాలులతో వర్షం కురిసిందని, దీంతో మాడుగుల మండలం సత్యవరంలో 20 ఎల్‌టీ స్తంభాలు, ఏడు హెచ్‌టీ స్తంభాలు విరిగి పడిపోయాయని ఆయన చెప్పారు. డి.గొట్టివాడ, సాగరం, కొత్తవలస, కె. వేలంపాడు గ్రామాల్లో 1,600 సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందన్నారు. వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి శుక్రవారం ఉదయం పది గంటలలోకల్లా సరఫరాను పునరుద్ధరించామన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి పరిధిలోని శాలిపేటలో గురువారం రాత్రి పది గంటల సమయంలో భారీ లోడుతో వెళుతున్న వాహనం స్తంభాలను లాగేసిందని, దాంతో ఆరు ఎల్‌టీ స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ కారణంగా గజపతినగరం, మెంటాడ మండలాల్లో 264 సర్వీసులకు విద్యుత్ అంతరాయం కలిగిందన్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ అందించామన్నారు.

విశాఖలో లోడ్ మానిటరింగ్ సెల్

విద్యుత్ సరఫరాలో వచ్చే అంతరాయాలను గుర్తించేందుకు విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయంలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షిస్తున్నామని సూర్యప్రకాశ్ చెప్పారు. డివిజన్ స్థాయిల్లో సైతం ఇలాంటి మానిటరింగ్ సెల్స్ పనిచేస్తున్నాయని, విద్యుత్ సమస్యలు ఏమున్నా 1912 నంబరుకు ఫోన్ చేసి చెప్పాలని ఆయన సూచించారు.

స్వయంశక్తి సంఘాల తీరుపై ఆరా..

... 5వ పేజీ తరువాయి

తమ కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న సంఘాలకే డిపోలను కేటాయించుకున్నారని గుర్తు చేస్తున్నారు. కరోనా సమయంలో జిల్లాలో ఖాళీగా ఉన్న పలు రేషన్ డిపోలకు డీలర్లను కేటాయించడానికి ఇబ్బందులు వచ్చాయి. రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించడం సాధ్యం కానందున స్వయంశక్తి సంఘాలకు సుమారు 60 డిపోలను తాత్కాలిక ప్రాతిపదికన 2020లో కేటాయించారు. ఎప్పుడైనా నోటిఫికేషన్ విడుదల చేసి ఆయా డిపోలకు డీలర్లను నియమించుకునే అధికారం పౌరసరఫరాల శాఖకు ఉందని అప్పట్లోనే అధికారులు స్పష్టం చేశారు. అయితే అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ నేతలకు అనుకూలంగా ఉన్న సంఘాలకే ఎక్కువ డిపోలను కేటాయించారని ఆరోపణలు వచ్చాయి. నగరంలో ఎక్కువ డిపోలు నిర్వహిస్తున్న బినామీలు కొందరు తమ కుటుంబ సభ్యులను స్వయంశక్తి సంఘాల్లో సభ్యులగా చేర్పించి వైసీపీ నేతల సిఫారసుతో డిపోలను చేజిక్కించుకున్నారు. అటువంటి డిపోలను బినామీలు నిర్వహిస్తుండగా, మరికొన్ని సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. రేషన్ బియ్యం విక్రయిస్తున్న ముఠాల వలలో పడిన కొన్ని స్వయంశక్తి సంఘాలు అక్రమాలకు పాల్పడడంతో వారిపై పౌరసరఫరాల అధికారులు కేసులు నమోదు చేశారు. ఇదిలావుండగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే డిపో డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేస్తే డీలర్ల సంఘ నేతలు, బినామీలు అడ్డుకున్నారు. నగరంలో 36 స్వయంశక్తి సంఘాలతో కోర్టులో పిటిషన్ దాఖలు చేయించగా స్టే వచ్చింది. సుమారు ఏడాదిన్నరగా స్టే కొనసాగుతోంది. ఇందుకు సంబంధించి కౌంటర్ వేయకుండా పౌరసరఫరాల శాఖ కమిషనరేట్‌లో గతంలో పనిచేసిన అధికారులను మేనేజ్ చేశారనే ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలిసిన ప్రస్తుత కమిషనర్ విశాఖ జిల్లాలో స్వయంశక్తి సంఘాల పనితీరు, కేసు వ్యవహారంపై ఆరా తీశారు. కాగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం పలు స్వయంశక్తి సంఘాల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాటిపై నిఘా పెట్టినట్టు తెలిసింది. దీనిపై రేషన్ డీలర్ల సంఘ నేతలు తాజాగా జిల్లా అధికారులను కలిసి మాట్లాడేందుకు ప్రయత్నిస్తే వారు గట్టిగా హెచ్చరించారని కొందరు డీలర్లు చెబుతున్నారు.

88 ఎకరాల అభివృద్ధికి జాయింట్ వెంచర్ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

వారికి అభివృద్ధి చేసిన దాంట్లో తగిన వాటా ఇస్తామని, ఇరు వర్గాలకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ జాయింట్ వెంచర్ ప్రాజెక్టు కోసం ఈ నెల 23న హైదరాబాద్‌లో, 30న బెంగళూరులో రోడ్ షోలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేశ్, సెక్రటరీ మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్ఈలు భవానీశంకర్, బలరామరాజు, పీవోలు వెంకటేశ్వరరావు, అరుణవల్లి, చామంతి, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఇక బస్టాపుల్లోనే పార్శిళ్ల బుకింగ్

... 5వ పేజీ తరువాయి

శ్రీకాకుళానికి రాకపోకలు సాగించే బస్సుల్లో, జోనల్ పరిధిలోని నాన్‌స్టాప్, సింగిల్ స్టాప్ సర్వీసుల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. బస్సులు ఆగే అన్ని కేంద్రాల్లోనూ డ్రైవర్లు పార్శిళ్లను బుక్ చేసుకుంటారు.

డ్రైవర్లకు శిక్షణ

యాటీఎస్ మిషన్‌ను వినియోగించే విధానంపై ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నారు. మొదటి దశలో దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే డ్రైవర్లకు శిక్షణను అందిస్తున్నారు. రీజియన్ పరిధిలోని మధురవాడ, విశాఖపట్నం, మద్దిలపాలెం, వాల్తేరు, సింహాచలం, గాజువాక, స్టీల్ సిటీ డిపోల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే 50 మంది వరకు డ్రైవర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారికి కూడా దశలవారీగా శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు.

వచ్చేనెల ఒకటి నుంచి అమలులోకి..

ఈ విధానం వచ్చేనెల ఒకటి నుంచి అమలులోకి తీసుకురావాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. తొలుత హైదరాబాద్, విజయవాడ, భీమవరం, చెన్నై బస్సుల్లో అమలు చేసి, దశలవారీగా అన్ని దూర ప్రాంత సర్వీసుల్లో, జోనల్ పరిధిలో తిరిగే బస్సుల్లోనూ అమలు చేస్తారు. దీనివల్ల పార్శిళ్ల బుకింగ్ చేసుకునే వారికి సమయం ఆదా అవుతుంది.

చిలకపేటలో బితుకు బితుకు బతుకులు

- క్షణక్షణం.. భయంభయంగా ఫెర్రీ రోడ్డు, కన్వేయర్ బెల్ట్ కింద ఉన్న బలహీన వర్గాల గృహాలు
- శిథిల స్థితిలో పేదల బతుకులు
- హామీలకే పరిమితమైన ఆధునికీకరణ
- ప్రభుత్వాలు మారినా.. తమ బతుకులు మారడం లేదంటూ నివాసితుల ఆవేదన

బీచ్ రోడ్డు, మే 16 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల బతుకు క్షణమొక యుగంలా ఉంటుంది. జీవీఎంసీ 39వ వార్డులోని చిలకపేట ఫెర్రీ రోడ్డు, కన్వేయర్ బెల్ట్ కింద ఉన్న బలహీన వర్గాల గృహాల్లో నివాసం ఉండాలంటేనే హడలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. ఇక్కడి గృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడమే ఇందుకు కారణం. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా కంటి మీద కునుకు లేకుండా భయం భయంగా గడపాల్సిన పరిస్థితి వస్తోందని అక్కడ నివాసం ఉంటున్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కన్వేయర్ బెడ్డు వద్ద ఉన్న బలహీన వర్గాల భవనానికి సంబంధించిన మెట్ల మార్గం కుప్పకూలింది. దీంతో ఆ భవనంలో నివసిస్తున్న నిరుపేదలు ఆందోళనతో గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి.


ఇరుకు సందు మధ్య ఉన్న దుర్భరంగా ఉన్న ఇళ్లు


కళావిహీనంగా తయారై శిథిలస్థితిలో గృహాలు


పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్రత

చిలకపేటలో బలహీనవర్గాల కోసం 1982లో జి+1 తరహాలో 62 ఇళ్లను నిర్మించారు. అంటే ఈ భవనాల వయస్సు దాదాపు 40 ఏళ్లు దాటడంతో కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వల్ల వచ్చే నిత్య శబ్దాలకు వీరు ఇళ్లకు గోడలు బీటలు వారాయి. 62 ఇళ్లల్లో దాదాపు 50 శాతం ఇళ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయి. మెట్లు, సీలింగ్‌లు, కారిడార్లు, గోడలు అన్నీ బీటలు వారి పెచ్చులూడిపోతున్నాయి. కొన్ని ఇళ్లు ఎప్పుడు నేలమట్టం అవుతాయోనన్న భయం నెలకొంది. ఇక్కడ ఉంటున్న వారు ఇరుకు సందుల్లో జీవనం కొనసాగిస్తున్నాయి. అలాగే మరుగుదొడ్లు అధ్వాన స్థితికి చేరాయి. ఇంటి బయట చిందరవందరగా పడివున్న చెత్తా చెదారాలు, కాలువలో మురుగునీరుతో నిత్యం దోమల బెడదతో కాలం నెట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ నివసిస్తున్న పేదోళ్ల జీవితాలు దుర్భర పరిస్థితి నెలకొంటోంది.

దేవుడా మాకు దిక్కెవరు?



వర్షం కురిసిన ప్రతిసారి ఇక్కడ ఇల్లు కూలడమే, పెచ్చులూడడమే జరుగుతోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చలనం ఉండడం లేదు. మాలాంటి బతుకులను వారు పట్టించుకోరేమో అనిపిస్తోంది. క్షణంక్షణం భయం భయంగా బతుకు ఈడ్చుతున్నాం. చిన్న పిల్లలు, ముసలి వాళ్లు ఉన్న ఇళ్ల వారికి మరింత భయంగా ఉంటుంది. ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని బతుకుతున్నామంటే నమ్మండి. భగవంతుడా మారు దిక్కెవరు?

- కె.ధానియమ్మ, నివాసితురాలు

మా బతుకులు మారవేమో..!



ప్రతి ఎన్నికల ముందు ఇళ్లను నేలమట్టం చేసి కొత్తగా నిర్మిస్తామంటూ పోటీ చేసే అభ్యర్థులు ఇక్కడికి వచ్చి హామీలు ఇస్తుంటారు. మా ఓట్లతో గెలిచిన తరువాత వీటిని నిర్మించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇక్కడ ఏదైనా సమస్య వచ్చినా.. ఇటు వైపు కన్నెత్తి కూడా చూడరు. తరాలు మారినా మా జీవితాల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. ప్రభుత్వాలు మారినా మా తలరాత మాత్రం మారడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఆశగా కలలు కంటున్నాం. రోజూ భయపడి బతికే కంటే వేరే చోటుకు వెళ్లడం మంచిదనే అభిప్రాయం అందరిలో ఉంది. కానీ, ఎక్కడికీ వెళ్ల లేని పరిస్థితి. పేదవాళ్లం

- దానయ్య, నివాసితుడు

మేయర్‌ను సత్కరించిన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు


మేయర్ పీలా శ్రీనివాసరావును సత్కరిస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

వెంకోజీపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పీవీవీ నాగరాజు, జనరల్ సెక్రటరీ ఎం.సంజీవరెడ్డి, అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మేయర్ ఛాంబర్‌లో విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలను తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను దక్కించుకున్న జీవీఎంసీ కాంట్రాక్టర్లు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి విశాఖ నగరాభివృద్ధికి సహకరించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఇప్పటికే పనులను పూర్తి చేసి, మిగిలిన పనులను ప్రారంభించేందుకు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను మంజూరు చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ కాంట్రాక్టర్లు మేయర్‌ను కోరారు. దీనిపై మేయర్ స్పందిస్తూ సంబంధిత కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల విడుదలపై కలెక్టర్‌తో చర్చించి బిల్లును అందించే ఏర్పాటు చేస్తానని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాల్సిందిగా జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులను కోరారు. కార్యక్రమంలో పలువురు జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగ పురుష విద్యార్థులకు వసతిగృహంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

పెదవాల్తేరు, మే 16 (ఆంధ్రజ్యోతి) :విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహంల 2025-26 సంవత్సరానికి నాలుగో తరగతి నుండి డిగ్రీ వరకు చదువుతున్న దివ్యాంగుల విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. పెదవాల్తేరు, పెందుర్తిలో గల వసతి గృహాల్లో ప్రవేశం కోరే విద్యార్థులకు ఉచిత భోజనం, వసతితో పాటు కాస్మోటిక్స్, యూనిఫారాలు, నోటు పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగ పురుష విద్యార్థులు వైద్య ధ్రువపత్రం, టీసీ, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, విద్యార్థుల రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో వసతి గృహాల వార్డెన్‌లను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం విశాఖపట్నం వసతిగృహం వార్డెన్ ఫోన్ నెం.94414 66347, పెందుర్తి వసతి గృహం వార్డెన్ ఫోన్ నెం.95054 94632 లో సంప్రదించాలని కోరారు.

డెంగ్యూ నిర్మూలించే దిశగా పయనిద్దాం


మాట్లాడుతున్న ఎంటమాలజీ విభాగం ఏడీ కేవీఎస్ ప్రసాదరావు

సిరిపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూను సమర్థవంతంగా నియంత్రించవచ్చని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మలేరియా కేవీఎస్ ప్రసాదరావు పేర్కొన్నారు. నేషనల్ డెంగ్యూ డే సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అవగాహన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడిస్ దోమలు కుట్టడం కారణంగా డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తుందన్నారు. రానున్న వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణ చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం ద్వారా డెంగ్యూ జ్వరాల వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఫ్రైడే పటిష్ఠంగా అమలు చేయడం, దోమలు పెరగకుండా ఎటువంటి చర్యలు చేపట్టాలి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని కూడా భాగస్వామ్యం చేయడం ద్వారా దోమల అభివృద్ధిని అరికట్టి జ్వరాల సంఖ్యను బాగా అదుపు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, ఎంపీహెచ్ఈఓ తిరుపతిరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, జీవీఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 4 వినతులు


వినతులు స్వీకరిస్తున్న సిటీ ప్లానరు కె.ధనుంజయ్‌రెడ్డి

వెంకోజీపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 4 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ సిటీ ప్లానరు కె.ధనుంజయ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగాటౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమాన్నినిర్వహించారు.

నగరాన్ని పర్యావరణహితంగా మార్చుదాం

- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండుటెండలు విపరీతంగా ఉన్నందున వేసవి తాపానికి నగర ప్రజలు గురి కాకుండా ఉండేందుకు జీవీఎంసీ అన్ని జోన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడమైనదని, అలాగే వేసవి తాపానికి నగర ప్రజల గురి కాకుండా జీవీఎంసీ పలు పర్యావరణహిత పరమైన చర్యలను చేపడుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జోన్-4లో గల జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమీపంలో పర్యావరణహిత చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రానికి వచ్చిన ప్రజలకు చల్లని తాగునీటిని స్వయంగా మేయర్ అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవిలో మండుటెండలకు భూమి వేడెక్కి నగర ప్రజలను ఒక్కరివెక్కిరి చేస్తుందన్నారు. ఇప్పటికే జీవీఎంసీ అన్ని జోన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసిందని, జీవీఎంసీతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయని, నగర ప్రజలు వేసవి తాపానికి గురికాకుండా ఇటువంటి చలివేంద్రాలని మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి ప్రజలకు చల్లని తాగునీటిని అందించాలని మేయర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాల నేపథ్యంలో విశాఖ నగరంలో పచ్చదనాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి చెట్లను పెంచుతూ, ప్రతి భవనంపై పచ్చదనాన్ని పెంపొందిస్తూ ఈ నగర చల్లని వాతావరణానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలన్నీరు తద్వారా వేసవి తాపానికి నగర ప్రజలు గురి కాకుండా ఆరోగ్యంగా జీవించగలరని అన్నారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి ఈఎస్వీ నరేశ్‌కుమార్, సహాయక ఇంజనీర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

18న 'నిశ్శబ్దమా..నీ ఖరీదెంత?' నాటిక స్వర్ణోత్సవ ప్రదర్శన

మద్దిలపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పీఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 'నిశ్శబ్దమా..నీ ఖరీదెంతా..?' నాటిక స్వర్ణత్సోవ వేడుక నిర్వహిస్తున్నట్టు తెలుగు కళాసమితి కార్యదర్శి వై.ఎస్.కె.ఎస్. స్వామి తెలిపారు. మద్దిలపాలెంలో శుక్రవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ 14వ జాతీయ స్థాయి తెలుగు నాటిక రచనల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో భాగంగా ఈ వేడుక చేస్తున్నామన్నారు. తెలుగు నాటిక రచనల పోటీకి 35 నాటిక రచనలు వచ్చాయన్నారు. వాటిలో ఉత్తమ రచనగా 'రిక్వెస్ట్', ద్వితీయ నాటికగా 'క్రతువు', తృతీయ ఉత్తమ నాటికగా 'మూగబోయిన సాక్ష్యం' ఎంపికైనట్టు తెలిపారు. ఈ నాటికల రచయితలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. అనంతరం 'నిశ్శబ్దమా..నీ ఖరీదెంతా?' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 25 సంవత్సరాలుగా నాటిక ప్రదర్శనలు నిర్వహిస్తూ బహుమతులు ప్రదానం చేస్తున్న గొలుగూరి వెంకటరెడ్డికి సన్మానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ వేడుకల్లో కళాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మంగరాజు మృతికి సీపీఐ నేతల నివాళి

మద్దిలపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ మాజీ కార్యవర్గ సభ్యుడు బోర మంగరాజురెడ్డి మద్దిలపాలెంలోని స్వగృహంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా శుక్రవారం సీపీఐ నేతలు అతని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు తమ సంతాపం తెలియజేశారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సభ్యుడు పైడిరాజు మాట్లాడుతూ స్థానిక ప్రజల సమస్యలు పరిష్కారానికి మంగరాజు అహర్నిశలు కృషి చేసేవారన్నారు. గత 8 సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి తుది శ్వాస విడిచారన్నారు. నివాళులర్పించి వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రహమాన్, సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్, నాగభూషణం, పడాల గోవింద్, పైల ఈశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- మిషన్ ఇంపాజిబుల్ : జగదాంబ
- ఫైనల్ డెస్టినేషన్ : శారద
- సింగిల్ : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- శుభం: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- హిట్-3 :సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచర పాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 22, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 34, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

బియ్యం కార్డులో మార్పుచేర్పులకు నిబంధనల సడలింపు

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి) : బియ్యం కార్డులో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేయడంలో కొన్ని నిబంధనలను సడలించినట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్ తెలిపారు. కార్డులో ఇంటి యజమాని పిల్లలకు వివాహమైన తరువాత కొత్తగా పేర్లు చేర్చడం, లేదా కొత్తగా కార్డుకు దరఖాస్తు చేయడానికి వివాహ సర్టిఫికెట్, ఫొటో ఉండాలన్న నిబంధనను సడలించామన్నారు. ఈ విషయాన్ని కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు గమనించాలని కోరారు.

రూ.1.3 లక్షలకు జైలులో మామిడి కాపు వేలం

ఆరిలోవ, మే 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్రకారాగారంలో నిర్వహించిన మామిడి తోట బహిరంగ వేలం పాటలో సుమారు రూ.1.30 లక్షలు పలికినట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. సుమారు 5 ఎకరాలలో గల 250 మామిడి చెట్లకు ఈ వేలంపాట నిర్వహించినట్టు చెప్పారు. గత ఆరు సంవత్సరాల నుంచి వీటి వేలం పాట వివరాలను ఆయన వెల్లడించారు.

2020లో రూ.65,000, 2021లో రూ.1,00,000, 2022లో రూ.52,000, 2023లో రూ.1,40,000, 2024లో రూ.80,000, 2025లో రూ.1,30,000 పలికినట్టు చెప్పారు.

బీపీని నిర్లక్ష్యం చేయవద్దు

వెంకోజీపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి: ప్రపంచ బీపీ దిపోత్సవం సందర్భంగా శనివారం మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టర్ అశ్విన్‌కుమార్ పాండా బీపీపై నిర్లక్ష్యం తగదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత కాలంలో దీర్ఘకాలిక సమస్యలు బాగా ఎక్కువై పోతున్నాయని, వాటిలో బీపీ కూడా ఒకటన్నారు. బీపీ అనేది ఒక్కసారి వచ్చిందంటే జీవితంలో మళ్లీ తగ్గనే తగ్గదన్నారు. కేవలం పెరగకుండా మాత్రమే అందరూ మందులు వాడతారన్నారు. అధిక బీపీ వలన గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ బీపీ వలన చాలా మంది హార్ట్ ఎటాక్‌కి గురై చనిపోతున్నారని, అందుకే ఇలాంటి సమస్యలు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కేంద్ర కారాగారంలో రూ.10 కోట్లతో అదనపు బ్యారెక్స్ నిర్మాణం

- సూపరింటెండెంట్ మహేశ్‌బాబు

ఆరిలోవ, మే 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో అదనపు బ్యారెక్స్ నిర్మాణానికి సన్నహాలు చేస్తున్నట్టు కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.10 కోట్లు కేటాయించినట్టు తెలిపారు ఈ నిధులతో సుమారు 200 మంది ఖైదీలకు సరిపడే విధంగా నూతన బ్యారెక్స్ నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు, ఈ భవన నిర్మాణానికి టెండర్లు కూడా పిలవడం జరిగినట్టు తెలిపారు.. దీనిని పోలీసు హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభం ప్రారంభమవుతాయన్నారు. ప్రస్తుతానికి ఈ కేంద్రకారాగారంలో సుమారు 900 మంది ఖైదీలు ఉండడానికి సరిపడుతుందని, కానీ ప్రస్తుతం 1800 మంది ఖైదీలు ఉంటున్నారని తెలిపారు స్థ లాభావం వల్ల రెండు నెలల క్రితం రాజమండ్రికి సుమారు 170 మంది ఖైదీలను పంపినట్టు ఆయన తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా వాహనాల పార్కింగ్


మద్దిలపాలెం ప్రాంతంలో జాతీయరహదారిపై వాహనాల పార్కింగ్ చేసిన స్థలాన్ని విడిచిపెట్టి వేసిన రోడ్డు

మద్దిలపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్ చేయడం కొత్త రోడ్డు నిర్మాణాలకు ఆటంకంగా మారాయి. వాహనాలను తీయడానికి వీలుపడక పక్క నుంచి రోడ్డు నిర్మాణాలు చేయాల్సివస్తోంది. దీనివల్ల రోడ్డు పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. జాతీయ రహదారి నూతన రోడ్డు నిర్మాణాల్లో భాగంగా మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్ వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో ఎక్కువగా సెకెండ్ హ్యాండ్ కార్ల షోరూమ్‌లు ఉన్నాయి. ఆయా షోరూమ్ కార్లు జాతీయ రహదారిపై పార్కింగ్ చేస్తున్నారు. స్థానిక నివాసులు కూడా కార్లను జాతీయ రహదారి పైనే పార్కింగ్ చేస్తున్నారు. అయితే గత పదిహేను రోజుల నుంచి నూతన రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ట్రాఫిక్ దృష్ట్యా అర్ధరాత్రి రోడ్డు పనులు చేస్తున్నారు. అప్పటికే రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేసి యజమానులు వెళ్లిపోతున్నారు. అర్ధరాత్రి రోడ్డు పనులు జరుగున్నాయని తెలిసినా కూడా వాహనాలను అక్కడే పార్కింగ్ చేయడం పనులకు ఆటంకంగా కలుగుతోంది. చేసేది లేక రోడ్డు వేస్తున్న వారు వాహనాలు పార్కింగ్ చేసిన ప్రదేశాన్ని విడిచి పెట్టి రోడ్డులు వేశారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ఎత్తు పల్లాల రోడ్డులతో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. సంబంధిత అధికారులు వాహనాలు తొలగించి పూర్తిస్థాయి రోడ్డు నిర్మాణాలు చేయాలని కోరుతున్నారు.

ఐటీ విద్యార్థులకు బూట్ క్యాంపులు


శిక్షణకు వచ్చిన విద్యార్థులతో నిర్వాహకులు

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐటీ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను అందించడంలో విద్యా సంస్థలు వెనకబడి ఉన్నందున విద్యార్థులకు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు నేర్పించేందుకు డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఐటీ రంగానికి చెందిన ప్రముఖులతో వారాంతపు బూట్ క్యాంపులు, ఖర్చు లేని శిక్షణ వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రేసపువానిపాలెంలోని టెక్ మహీంద్రా ఆవరణలో కొంతమంది విద్యార్థులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది. దీనికి ఎస్‌టీపీఐ అడిషనల్ డైరెక్టర్ సురేశ్ బేతా హాజరై వారికి ఐటీ రంగంపై, అవసరమైన శిక్షణపైనా అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సంస్థ ఛైర్మన్ శ్రీధర్ కొసరాజు అధ్యక్షత వహించగా డబ్ల్యుఎన్స్ ప్రతినిధి ఆర్‌ఎల్ నారాయణ, టెక్ మహీంద్ర ప్రతినిధి జి.మురళీకృష్ణ, డైరెక్టర్ శ్రీహరి హాజరయ్యారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగిస్తాం

» మౌలిక వసతుల కల్పన లక్ష్యం » ప్రభుత్వ రాయితీ ద్వారా రూ.44 కోట్ల పన్నులు వసూలు » ఆంధ్రజ్యోతితో జోన్‌-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

డాబాగార్డెన్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్ నుంచి ఎల్ఐసీ, జగదాంబ, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగిస్తామని, త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ చేపడతామని జోన్‌-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. కొందరు షాపుల్లో ఉంటూనే ఫుట్‌పాత్‌లపైకి వచ్చి దుకాణాలకు సంబంధించి స్టాండింగ్ ఫ్లెక్సీలు పెడు



సరస్వతి పార్కులో పరిశుభ్రత అవసరం

తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీన్ని తీవ్రంగా పరిగణిస్తామని చెప్పారు. జోన్‌-4 పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఆంధ్రజ్యోతి ఆయనను ప్రశ్నించగా జోనల్ కమిషనర్ ప్రజలకు కనీస వసతుల కల్పన లక్ష్యంగా యంత్రాంగంతో పనిచేయిస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన పన్ను రాయితీ అవకాశాన్ని చాలా మంది ఉపయోగించుకోవడంతో సుమారు రూ.44 కోట్ల పన్నుల బకాయిలను వసూలు చేసినట్లు మల్లయ్యనాయుడు చెప్పారు. మరికొన్ని వివరాలు ఆయన మాటల్లోనే..దక్షిణ నియోజకవర్గంలో 28 నుంచి 39 మొత్తం (12) వార్డులలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఉదయం, రాత్రి సమయాల్లో రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ కార్మికులతో రహదారులను శుభ్రం చేయిస్తున్నాం. క్లాప్ వాహనాలు వెళ్లలేని ప్రాంతాలకు కార్మికులు వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. వార్డుల్లో దోమల నివారణకు పొగకొడుతున్నాం. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తున్నాం. నిరుడు జూన్ 15న సూర్యాబాగ్ జోనల్‌-4 కార్యాలయంలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు 916 ఫిర్యాదులు రాగా, 871 పరిష్కరించాం. టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు రావడాన్ని గమనించి సిబ్బందిని అప్రమత్తం చేశాం. వేసవిలో ఆహ్లాదం కోసం పార్కులకు వచ్చే సందర్శకులను దృష్టిలో ఉంచుకుని హైమాస్ట్ దీపాలు వెలిగేలా చూస్తూ, ఆయా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షిస్తున్నాం. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ విశాఖ కార్యక్రమాన్ని అన్ని పార్కుల్లో పక్కాగా అమలు చేయడంలో భాగంగా ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చైతన్య పరుస్తున్నాం. అనేక ప్రాంతాల్లో చెట్ల మొదళ్ల దగ్గర వ్యర్థాలు వేస్తున్నట్లు గమనించాం. ఇకపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వేసవిలో చెట్ల కింద సేదతీరేందుకు ప్రజలు వస్తుంటారు. మట్టి తప్ప మరేమీ లేకుండా చర్యలు తీసుకుంటాం.వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇంతవరకు మొత్తం 42 చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తి తీరుస్తున్నాం. 31, 32, 33 వార్డుల్లోని కొన్ని ప్రాంతాల్లో మంచినీటి దార తక్కువగా వస్తోంది. ఎంజీఎం వద్ద పురాతనమైన తాటిపూడి పైపులైన్ వ్యవస్థను మార్చడం ద్వారా ఈ సమస్య నుంచి బయటపడవచ్చని గుర్తించాం. కొండవాలు ప్రాంతాలైన బంగారమ్మమెట్ట, వెంకటేశ్వరమెట్ట, హరివీధి తదితర



ఎం.మల్లయ్యనాయుడు, జోనల్ కమిషనర్

ర ప్రాంతాలకు ఈసారి పూర్తిస్థాయిలో నీరు వస్తోంది. నిరుడు దాదాపు రూ.28.5 కోట్లు వసూలైన పన్నుల మొత్తం ఈసారి ప్రభుత్వం రాయితీ ప్రకటించడంతో సుమారు రూ.44 కోట్లకు పెరిగింది. మొండి బకాయిలను వసూలు చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు వివరించారు.

నేడు 50వ వార్డులో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

మాధవధార, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం 50వ వార్డులో అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్లు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్క్ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, జోన్‌-5 జెడ్సీ, ప్రజారోగ్య విభాగం సహా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరుకానున్నట్లు తెలిపారు. వైశాఖ స్పోర్ట్సు పార్క్ నుంచి ఉదయం 6.30 గంటలకే కార్యక్రమం ఆరంభం అవుతుందని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అక్కయ్యపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రాన్ని పంపారు. గత ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలను, మున్సిపల్ పాఠశాలలను బలవంతంగా ప్రభుత్వంలో విలీనం చేసి, ఉపాధ్యాయుల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోకుండా, వారిని మానసిక ఆందోళనకు గురిచేసిందన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.

కౌమార దశపై అవగాహన అవసరం

మురళీనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వవార్డు మాధవధార గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. టీం కన్వీనర్ వరలక్ష్మి మాట్లాడుతూ వేసవి శిబిరంలో 16 ఏళ్లలోపు బాలికలు పాల్గొనాలని సూచించారు. ఆరోగ్య పరంగా ఎదురయ్యే సమస్యలు, రక్తహీనత, ఇతర ఇబ్బందులపై చర్చిస్తామన్నారు. అంగన్వాడీ టీచర్ మౌల బీబీ, ఏఎన్ఎం స్రవంతి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

సీతంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను ద్వారకా ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో గురుద్వార కూడలి నుంచి సీతంపేట కూడలి వరకు పలు దుకాణాలను, చిరు వ్యాపారాలు సాగిస్తున్న బండ్లను తొలగించారు.

జనసేన సభ్యత్వ కార్డుల పంపిణీ

మహారాణిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ సభ్యత్వాలు భారీగా జరుగుతున్నాయని ఆ పార్టీ దక్షిణ నియోజకవర్గం నాయకుడు మన్యాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మహారాణిపేటలోని జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద పార్టీ సభ్యత్వాలు చేపట్టడంతో పాటు నమోదు చేసుకున్న వారికి కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా జనసేన గొప్ప కార్యక్రమాన్ని తలపెట్టిందని, క్రియాశీలక సభ్యత్వాలతో కార్యకర్తల్లో భరోసా నింపుతున్నారని చెప్పారు. జనవాణి ద్వారా ఎమ్మెల్యే వంశీకృష్ణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

పర్యాటక, గృహ నిర్మాణ ప్రాజెక్టులపై సమీక్ష

మహారాణిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆయా శాఖల ప్రగతిపై శుక్రవారం సమీక్షించారు జిల్లాలో పర్యటక ప్రాజెక్టుల స్థితిగతులను కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆయనకు వివరించారు. అనంతరం ఔత్సాహిక కంపెనీలకు భూకేటాయింపులు, ప్రభుత్వ సహకారం, సాంకేతిక ప్రక్రియ ఇతర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అన్నవరం వద్ద నిర్మించనున్న ఒబెరాయ్,ఫేయిర్ గ్రూప్ హోటల్ నిర్మాణాలకు సంబంధించిన స్థలాలను పరిశీలించారు,

స్వయంశక్తి సంఘాల తీరుపై ఆరా

... 5వ పేజీ తరువాయి

తమ కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న సంఘాలకే డిపోలను కేటాయించుకున్నారని గుర్తు చేస్తున్నారు. కరోనా సమయంలో జిల్లాలో ఖాళీగా ఉన్న పలు రేషన్ డిపోలకు డీలర్లను కేటాయించడానికి ఇబ్బందులు వచ్చాయి. రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించడం సాధ్యం కానందున స్వయంశక్తి సంఘాలకు సుమారు 60 డిపోలను తాత్కాలిక ప్రాతిపదికన 2020లో కేటాయించారు. ఎప్పుడైనా నోటిఫికేషన్ విడుదల చేసి ఆయా డిపోలకు డీలర్లను నియమించుకునే అధికారం పౌరసరఫరాల శాఖకు ఉందని అప్పట్లోనే అధికారులు స్పష్టం చేశారు. అయితే అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ నేతలకు అనుకూలంగా ఉన్న సంఘాలకే ఎక్కువ డిపోలను కేటాయించారని ఆరోపణలు వచ్చాయి. నగరంలో ఎక్కువ డిపోలు నిర్వహిస్తున్న బినామీలు కొందరు తమ కుటుంబ సభ్యులను స్వయంశక్తి సంఘాల్లో సభ్యులుగా చేర్పించి వైసీపీ నేతల సిఫారుసుతో డిపోలను చేజిక్కించుకున్నారు. అటువంటి డిపోలను బినామీలు నిర్వహిస్తుండగా, మరికొన్ని సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. రేషన్ బియ్యం విక్రయిస్తున్న ముఠాల వలలో పడిన కొన్ని స్వయంశక్తి సంఘాలు అక్రమాలకు పాల్పడడంతో వారిపై పౌరసరఫరాల అధికారులు కేసులు నమోదు చేశారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే డిపో డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేస్తే డీలర్ల సంఘ నేతలు, బినామీలు అడ్డుకున్నారు. నగరంలో 36 స్వయంశక్తి సంఘాలతో కోర్టులో పిటిషన్ దాఖలు చేయించగా స్టే వచ్చింది. సుమారు ఏడాదిన్నరగా స్టే కొనసాగుతోంది. ఇందుకు సంబంధించి కౌంటర్ వేయకుండా పౌరసరఫరాల శాఖ కమిషనరేట్‌లో గతంలో పనిచేసిన అధికారులను మేనేజ్ చేశారనే ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలిసిన ప్రస్తుత కమిషనర్ విశాఖ జిల్లాలో స్వయంశక్తి సంఘాల పనితీరు, కేసు వ్యవహారంపై ఆరా తీశారు. కాగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం పలు స్వయంశక్తి సంఘాల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాటిపై నిఘా పెట్టినట్టు తెలిసింది. దీనిపై రేషన్ డీలర్ల సంఘ నేతలు తాజాగా జిల్లా అధికారులను కలిసి మాట్లాడేందుకు ప్రయత్నిస్తే వారు గట్టిగా హెచ్చరించారని కొందరు డీలర్లు చెబుతున్నారు.

పూర్తిస్థాయిలో మౌలిక వసతులు

కంచరపాలెం/మర్రిపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 54వవార్డు పరిధి వివేకానందవీధి, జ్యోతినగర్ తదితర ప్రాంతాల్లోని పార్కుల్లో నూతన వసతుల కల్పనకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ సుమారు రూ.50 లక్షలతో పిల్లల పార్కు, రోడ్లు, నూతన వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగక, తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడ్డారన్నారు. ప్రజలకు అత్యంత అవసరమైన వీధిదీపాలు, తాగు నీరు, పారిశుద్ధ్యం తదితర సదుపాయాలను శతశాతం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్, జడ్సీ రాము,బీజేపీ వార్డు అధ్యక్షుడు రంగుముద్ర రాంబాబు, పెంటకోట స్రవంతి, జి.అరుణ్, నాయకులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు

ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడండి

సీతంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి చుట్టు పక్కల దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలు ఉన్నాయేమో పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారులు సూచించారు. జీవీఎంసీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా అధికారులు, సిబ్బంది శుక్రవారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి బుల్లయ్య కళాశాల పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని, వాటి ద్వారా మలేరియా, డెంగ్యూ, చికిన గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమల వ్యాప్తి అరికట్టడానికి ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జోనల్ మలేరియా కార్యాలయ డైరెక్టర్ కేవీఎస్ ప్రసాదరావు, జిల్లా మలేరియా అధికారిణి ఎం.తులసి పాల్గొన్నారు.

20 నుంచి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

మహారాణిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం, స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు ఈనెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు తెలిపారు. శుక్రవారం ఆయన సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకపోగా, ప్లాంట్‌ను ఆర్సిలార్ మిట్టల్‌కు కట్టబెట్టాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ నిధులను ప్లాంట్ అప్పులు తీర్చడానికి ఉపయోగిస్తున్నారని కానీ ప్లాంట్ అభి వృద్ధికి, కార్మికుల జీతాలు చెల్లింపునకు వినియోగించడం లేదని చెప్పారు. గత ఐదేళ్లుగా కార్మికుల పోస్టులు భర్తీ చేయడం లేదని, వీఆర్ఎస్ పేరుతో 1213 మంది ఉద్యోగులను తొలగించారని తెలిపారు. పని భారం తీవ్రంగా ఉందని, నాలుగు మెషన్ల వద్ద ఒక్క కార్మికుడు పని చేస్తున్నాడన్నారు. కార్మికులు కనీసం సమావేశాలు నిర్వహించుకోవడానికి కూడా ఆంక్షలు విధిస్తున్నారని, షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారని విమర్శించారు. ఈనేపథ్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీటూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, కెఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

ప్రజాప్రతినిధుతో జడ్సీ సమావేశం

జ్ఞానాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లను పరిపాలనా సౌలభ్యం కోసం అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాతిపదికన విభజన చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలపై జోన్‌-5 కమిషనర్ బి. రాము ప్రజాప్రతినిధుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. శుక్రవారం ఆయన జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు నుంచి ప్రభుత్వం ప్రతిపాదనపై సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జోన్‌-5 కార్యాలయం పశ్చిమ, ఉత్తర, దక్షిణం, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉండడంతో పలు సమస్యలు ఉన్నాయని తెలిపారు. 45, 42వ వార్డులను ఉత్తర నియోజకవర్గంలో ఉంచాలని,జోన్లు విభజన చేస్తే 45వ వార్డులోని కొన్ని ప్రాంతాలను భీమిలి జోన్‌కు, 42వ వార్డులోని కొన్ని ప్రాంతాలను దక్షిణం జోన్‌కు వెళ్లాల్సి వస్తుందని, ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ టీపీఓ ప్రవీణ్, జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ సీనియర్ నాయకులు సనపల వరప్రసాద్, కార్పొరేటర్లు, టీడీపీ, జనసేన వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

విశాఖలో రైల్వే ఏజీఎం తనిఖీలు



అధికారులతో సమీక్షిస్తున్న ఏజీఎం మోహెస్‌కుమార్

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే అదనపు జనరల్ మేనేజర్ మోహెస్‌కుమార్ బెహరా శుక్రవారం విశాఖలో తనిఖీలు చేశారు. రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఆలిండియా గార్డు కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార్డులు, ఇతర సిబ్బంది నిర్వహించే కీలక బాధ్యతలు, భద్రత వంటి పలు అంశాలపై మాట్లాడారు. రైల్వే యాజమాన్యం చేపట్టాల్సిన చర్యలు, కల్పించాల్సిన సదుపాయాలపై చర్చించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేసిన అనంతరం డీఆర్ఎం కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పరిశుభ్రత, సరుకు రవాణా లోడింగ్, సురక్షితమైన రైలు కార్యకలాపాలు, ట్రాక్ నిర్వహణ వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించడమే కాకుండా తగిన భద్రత, నిర్వహణ చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు.

ఫ్రైడే!

... 5వ పేజీ తరువాయి

వంటిని కప్పుకుని కనిపించారు.

ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు భానుడి ప్రతాపానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అత్యవసరమైతే తప్పా బయటకు వచ్చేందుకు ఎవరూ సాహసించలేదు. ఉదయం 11 గంటల తరువాత నుంచి పలుచోట్ల వేడి గాలులు వీయడంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు నానాపాట్లు పడ్డారు. ఎండ వేడిమి నుంచి సేదతీరేందుకు ఫ్యాన్లు, ఏసీలను ఎక్కువగా వినియోగించారు. ఆరుబయట పనిచేసేవాళ్లు చెట్ల కిందకు చేరిపోయి ఉపశమనం పొందే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నందున చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎండ, వేడి గాలుల నుంచి సేదతీరేందుకు సాయంత్రం ఐదు గంటల తరువాత అధిక శాతం మంది సాగరతీరాలకు చేరుకున్నారు. పలువురు సముద్రంలో స్నానాలు చేస్తూ గడిపారు.

నడిరోడ్డుపై వైసీపీ నేత జన్మదిన వేడుకలు

» మాజీ కార్పొరేటర్ హనుమంతురావుతో పాటు మరికొందరిపై కేసు నమోదు

కొమ్మాది, మే 16 (ఆంధ్రజ్యోతి) : నడి రోడ్డుపై పుట్టినరోజు వేడుకలు జరిపి, హంగామా చేసిన వైసీపీ మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి నట్టు పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపారు. గురువారం రాత్రి మధురవాడ ఐటీ సెజ్ మార్గంలోని మ్యాగి కూడలి వద్ద పోతిన హనుమంతురావు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు జరి పారు. రోడ్డుపై కేక్ కట్ చేయడంతో పాటు పెట్రోల్‌తో మంటలు వేసి, బాణసంచా కాల్చడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బందులు పడ్డారు. ఈ దృశ్యాలను కొందరు వీడియో తీసి నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చీకి వాట్సాప్‌లో ఫిర్యాదు చేయడంతో తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన పీఎంపాలెం పోలీసులను ఆదేశించారు. సీఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి హంగామా చేస్తున్న వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించారు. సీపీ ఆదేశాల మేరకు హనుమంతురావుతో పాటు మరికొంతమందిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు. వీడియోను పరిశీలించి, మిగిలిన వారిపై కూడా కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ సంచులు స్వాధీనం.. వ్యాపారులకు రూ.2 వేల జరిమానా

సీతమ్మధార, మే 16 (ఆంధ్రజ్యోతి): పదే పదే హెచ్చరించినా ప్లాస్టిక్ వాడుతున్న చిరు వ్యాపారుల నుంచి మూడు కేజీల సంచులను జీవీఎంసీ అధికారులు సీజ్ చేశారు. వ్యాపారులకు రూ.2 వేల జరిమానా విధించారు. 24వ వార్డులో ఓల్డ్ రేసపువానిపాలెం, సీఎంఆర్ పక్కన ఉన్న స్ట్రీట్ వెండర్స్ షాపులకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సెక్రటరీలు మోహన్, పద్మజ, షరాన్, సతీష్‌లు తనిఖీలు నిర్వహించారు. జీవీఎంసీ సూపర్‌వైజర్లు కోట రమణ, మణి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

88 ఎకరాల అభివృద్ధికి జాయింట్ వెంచర్ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

వారికి అభివృద్ధి చేసిన దాంట్లో తగిన వాటా ఇస్తామని, ఇరు వర్గాలకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ జాయింట్ వెంచర్ ప్రాజెక్టు కోసం ఈ నెల 23న హైదరాబాద్‌లో, 30న బెంగళూరులో రోడ్ షోలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేశ్, సెక్రటరీ మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్ఈలు భవానీశంకర్, బలరామరాజు, పీవోలు వెంకటేశ్వరరావు, అరుణవల్లి, చామంతి, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాలో గోల్‌మాల్?

... 5వ పేజీ తరువాయి

చేసుకున్నారు. మిగిలిన వాటిలో 3,342 ఇళ్లకు పునాదులు తవ్వగా, సుమారు 24 వేల ఇళ్లు పునాదుల వరకు, 20,400 ఇళ్లకు పునాదులు పూర్తి చేయగా..మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కేంద్రం ఇచ్చే పీఎంఏవై నిధులు రూ.1.8 లక్షలతో చేపట్టే ఇళ్లకు ముందు గోడను మాత్రమే ప్లాస్టింగ్ చేస్తారు. దీనికి కూడా ఐదు టన్నుల వంతున ఇసుకను సరఫరా చేస్తున్నారు. అదే డ్వాక్రా సంఘం నుంచి ఇచ్చే రూ.35 వేలు అందితే మొత్తం ప్లాస్టింగ్ చేస్తారు. దీనికి అనుగుణంగానే ఇసుక సరఫరా చేయాలి. శ్లాబ్ వరకు 15 టన్నులు సరఫరా చేసిన అధికారులు.. మొత్తం ఇళ్ల పూర్తికి మిగిలిన ఐదు టన్నుల సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటివరకు పూర్తిచేసిన 38 వేల ఇళ్లలో రూ.1.8 లక్షలు, రూ.2.15 లక్షలు కేటాయించినవి ఉన్నాయి. ఈ రెండింటికీ ఒకేలా 20 టన్నుల వంతున ఇసుక సరఫరా చేశారు.ఇంటి ముందు గోడ ప్లాస్టింగ్ చేయడానికి ఐదు టన్నుల ఇసుక అవసరం లేదు. అయినా కాంట్రాక్టర్లు ఇండెంట్ పెట్టిన వెంటనే ఇసుక కోసం ఆన్‌లైన్‌లో ఇన్ వాయిస్‌లో జనరేట్ చేస్తున్నారు. మరో విశేషమేమిటంటే.. సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణానికి 13 టన్నుల ఇసుక సరిపోతుందని నగరంలో ప్రైవేటు ఇళ్లు నిర్మిస్తున్న సివిల్ ఇంజనీర్ ఒకరు తెలిపారు. అటువంటిది సెంటు స్థలంలో నిర్మించే ఇంటికి 20 టన్నుల్లో ఐదారు టన్నుల వరకు మిగులుతుందన్నారు. ఇదిలావుండగా రీచ్‌ల నుంచి వచ్చే ఇసుక లోడుల్లో కొన్నింటిని మధ్యలోనే దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక సరఫరా విషయంలో కాంట్రాక్టర్లకు కొందరు ఏఈలు అడ్డగోలుగా సాయపడుతున్నారనే వాదన ఉంది. లేఅవుట్లలో ఇసుక నిల్వలు, వినియోగంపై లెక్కలు తేల్చకుండా కాంట్రాక్టర్లు ఇచ్చిన సొమ్ముతో కొందరు అధికారులు జేబులు నింపుకుంటున్నారనే ఫిర్యాదులున్నాయి. ఇసుక వినియోగంపై వారం, పది రోజుల క్రితం జిల్లాకు వచ్చిన ఉన్నతాధికారి చేసిన హెచ్చరికతో అధికారులు అప్రమత్తం అవుతారా? అనేది అనుమానమేనని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేసే ఇసుక వినియోగంపై సమగ్ర విచారణ చేపడితే గుట్టురట్టు అవుతుందని రిటైర్డు హౌసింగ్ అధికారి వ్యాఖ్యలు చేశారు.

ఆ 88 ఎకరాల్లోనే ఫిన్‌టెక్ సిటీ!

... 5వ పేజీ తరువాయి

సిటీగా ప్రకటించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐటీని పట్టించుకోకపోవడంతో రుషికొండలోని ఫిన్‌టెక్ సంస్థలు ఒక్కొక్కటిగా వెళ్లిపోయాయి. ఇప్పుడు అద్దె భవనాల్లో కాకుండా సొంతంగానే రాష్ట్ర ప్రభుత్వం 'ఫిన్‌టెక్ సిటీ'ని నిర్మించాలని ప్రణాళిక రూపొందిస్తోంది. ఇది కార్యరూపం దాల్చడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

మొదటి వారంలో

టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, స్టార్టప్‌లకు అండగా ఉండడానికి 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'ను ప్రభుత్వం అమరావతిలో నెలకొల్పింది. దీనికి అనుబంధంగా మరో ఎనిమిది రీజనల్ కేంద్రాలను ప్రకటించింది. వీటిని అభివృద్ధి చేసే బాధ్యతలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించింది. విశాఖలో రీజనల్ హబ్‌ను జీఎంఆర్ గ్రూపునకు ఇచ్చారు. ఇందుకోసం వీఎంఆర్డీఏ సిరిపురం జంక్షన్‌లో కొత్తగా నిర్మించిన 'ది డెక్' భవనంలో ఒక అంతస్థును కేటాయించారు. దీనికి అవసరమైన మౌలిక వసతుల కోసం తాజాగా ప్రభుత్వం రెండు కోట్ల రూపాయలను విడుదల చేయడంతో ఇంటీరియర్ పనులను ప్రారంభించారు. దీనిని జూన్ మొదటి వారంలో ప్రారంభించే అవకాశం ఉందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి శుక్రవారం తెలిపారు.

జిల్లాకు ఐటీ మేనేజర్ ఏరీ?

ప్రతి జిల్లాలో ఐటీ వ్యవహారాలను పర్యవేక్షించడానికి ఒక మేనేజర్‌ను నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. విశాఖపట్నంలో గతంలో టెక్ మహేంద్రాలో ఏపీటా కార్యాలయం ఉండేది. అధికారులు కూడా ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారిని తొలగించింది. ఆ తరువాత రుషికొండ స్టార్టప్ విలేజ్‌లో జాయింట్ డైరెక్టర్ కేడర్‌లో ఒక మహిళ పనిచేసేవారు. ఆమె కూడా ఇప్పుడు లేరు. ఐటీ సంస్థలకు రావాల్సిన రాయితీ బకాయిల కోసం సంప్రతించడానికి కూడా ఎవరూ లేరు. అందువల్ల తక్షణమే ఒక మేనేజర్‌ను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెరిగిన విద్యుత్ వినియోగం

... 5వ పేజీ తరువాయి

సరఫరాలో ఊహించని ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లకు ప్రతి శుక్రవారం నిర్వహణ పనులు చేపడుతున్నామని, అందులో భాగంగా శుక్రవారం కొన్నిచోట్ల అంతరాయం ఏర్పడిందన్నారు. అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల గురువారం రాత్రి పెనుగాలులతో వర్షం కురిసిందని, దీంతో మాడుగుల మండలం సత్యవరంలో 20 ఎల్‌టీ స్తంభాలు, ఏడు హెచ్‌టీ స్తంభాలు విరిగి పడిపోయాయని ఆయన చెప్పారు. డి.గొట్టివాడ, సాగరం, కొత్తవలస, కె.వేలంపాడు గ్రామాల్లో 1,600 సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందన్నారు. వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి శుక్రవారం ఉదయం పది గంటలోకల్లా సరఫరాను పునరుద్ధరించామన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి పరిధిలోని శాలిపేటలో గురువారం రాత్రి పది గంటల సమయంలో భారీ లోడుతో వెళుతున్న వాహనం స్తంభాలను లాగేసిందని, దాంతో ఆరు ఎల్‌టీ స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ కారణంగా గజపతినగరం, మెంటాడ మండలాల్లో 264 సర్వీసులకు విద్యుత్ అంతరాయం కలిగిందన్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ అందించామన్నారు.

విశాఖలో లోడ్ మానిటరింగ్ సెల్

విద్యుత్ సరఫరాలో వచ్చే అంతరాయాలను గుర్తించేందుకు విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయంలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షిస్తున్నామని సూర్యప్రకాశ్ చెప్పారు. డివిజన్ స్థాయిల్లో సైతం ఇలాంటి మానిటరింగ్ సెల్స్ పనిచేస్తున్నాయని, విద్యుత్ సమస్యలు ఏమున్నా 1912 నంబరుకు ఫోన్ చేసి చెప్పాలని ఆయన సూచించారు.

ఇక బస్టాపుల్లోనే పార్శిళ్ల బుకింగ్

... 5వ పేజీ తరువాయి

శ్రీకాకుళానికి రాకపోకలు సాగించే బస్సుల్లో, జోనల్ పరిధిలోని నాన్‌స్టాప్, సింగిల్ స్టాప్ సర్వీసుల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. బస్సులు ఆగే అన్ని కేంద్రాల్లోనూ డ్రైవర్లు పార్శిళ్లను బుక్ చేసుకుంటారు.

డ్రైవర్లకు శిక్షణ

యూటీఎస్ మిషన్‌ను వినియోగించే విధానంపై ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నారు. మొదటి దశలో దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే డ్రైవర్లకు శిక్షణను అందిస్తున్నారు. రీజియన్ పరిధిలోని మధురవాడ, విశాఖపట్నం, మద్దిలపాలెం, వాల్తేరు, సింహాచలం, గాజువాక, స్టీల్ సిటీ డిపోల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే 50 మంది వరకు డ్రైవర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారికి కూడా దశలవారీగా శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు.

వచ్చేనెల ఒకటి నుంచి అమలులోకి..

ఈ విధానం వచ్చేనెల ఒకటి నుంచి అమలులోకి తీసుకురావాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. తొలుత హైదరాబాద్, విజయవాడ, భీమవరం, చెన్నై బస్సుల్లో అమలు చేసి, దశలవారీగా అన్ని దూర ప్రాంత సర్వీసుల్లో, జోనల్ పరిధిలో తిరిగే బస్సుల్లోనూ అమలు చేస్తారు. దీనివల్ల పార్శిళ్లు బుకింగ్ చేసుకునే వారికి సమయం ఆదా అవుతుంది.

చిలకపేటలో బితుకు బితుకు బతుకులు

- క్షణక్షణం.. భయంభయంగా ఫెర్రీ రోడ్డు, కన్వేయర్ బెల్ట్ కింద ఉన్న బలహీన వర్గాల గృహాలు
- శిథిల స్థితిలో పేదల బతుకులు
- హామీలకే పరిమితమైన ఆధునికీకరణ
- ప్రభుత్వాలు మారినా.. తమ బతుకులు మారడం లేదంటూ నివాసితుల ఆవేదన


ఇరుకు సందు మధ్య ఉన్న దుర్భరంగా ఉన్న ఇళ్లు


కళావిహీనంగా తయారై శిథిలస్థితిలో గృహాలు


పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్రత

బీచ్ రోడ్డు, మే 16 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల బతుకు క్షణమొక యుగంలా ఉంటుంది. జీవీఎంసీ 39వ వార్డులోని చిలకపేట ఫెర్రీ రోడ్డు, కన్వేయర్ బెల్ట్ కింద ఉన్న బలహీన వర్గాల గృహాల్లో నివాసం ఉండాలంటేనే హడలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. ఇక్కడి గృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడమే ఇందుకు కారణం. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా కంటి మీద కునుకు లేకుండా భయం భయంగా గడపాల్సిన పరిస్థితి వస్తోందని అక్కడ నివాసం ఉంటున్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కన్వేయర్ బెడ్డు వద్ద ఉన్న బలహీన వర్గాల భవనానికి సంబంధించిన మెట్ల మార్గం కుప్పకూలింది. దీంతో ఆ భవనంలో నివసిస్తున్న నిరుపేదలు ఆందోళనతో గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి.

చిలకపేటలో బలహీనవర్గాల కోసం 1982లో జి+1 తరహాలో 62 ఇళ్లను నిర్మించారు. అంటే ఈ భవనాల వయస్సు దాదాపు 40 ఏళ్లు దాటడంతో కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వల్ల వచ్చే నిత్య శబ్దాలకు వీరు ఇళ్లకు గోడలు బీటలు వారాయి. 62 ఇళ్లల్లో దాదాపు 50 శాతం ఇళ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయి. మెట్లు, సీలింగ్‌లు, కారిడార్లు, గోడలు అన్నీ బీటలు వారి పెచ్చులూడిపోతున్నాయి. కొన్ని ఇళ్లు ఎప్పుడు నేలమట్టం అవుతాయోనన్న భయం నెలకొంది. ఇక్కడ ఉంటున్న వారు ఇరుకు సందుల్లో జీవనం కొనసాగిస్తున్నాయి. అలాగే మరుగుదొడ్లు అధ్వాన స్థితికి చేరాయి. ఇంటి బయట చిందరవందరగా పడివున్న చెత్తా చెదారాలు, కాలువలో మురుగునీరుతో నిత్యం దోమల బెడదతో కాలం నెట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ నివసిస్తున్న పేదోళ్ల జీవితాలు దుర్భర పరిస్థితి నెలకొంటోంది.

దేవుడా మాకు దిక్కెవరు?



వర్షం కురిసిన ప్రతిసారి ఇక్కడ ఇల్లు కూలడమే, పెచ్చులూడడమే జరుగుతోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చలనం ఉండడం లేదు. మాలాంటి బతుకులను వారు పట్టించుకోరేమో అనిపిస్తోంది. క్షణంక్షణం భయం భయంగా బతుకు ఈడ్చుతున్నాం. చిన్న పిల్లలు, ముసలి వాళ్లు ఉన్న ఇళ్ల వారికి మరింత భయంగా ఉంటుంది. ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని బతుకుతున్నామంటే నమ్మండి. భగవంతుడా మారు దిక్కెవరు?

\- కె.ధానియమ్మ, నివాసితురాలు

మా బతుకులు మారవేమో..!



ప్రతి ఎన్నికల ముందు ఇళ్లను నేలమట్టం చేసి కొత్తగా నిర్మిస్తామంటూ పోటీ చేసే అభ్యర్థులు ఇక్కడికి వచ్చి హామీలు ఇస్తుంటారు. మా ఓట్లతో గెలిచిన తరువాత వీటిని నిర్మించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇక్కడ ఏదైనా సమస్య వచ్చినా.. ఇటు వైపు కన్నెత్తి కూడా చూడరు. తరాలు మారినా మా జీవితాల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. ప్రభుత్వాలు మారినా మా తల రాత మాత్రం మారడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఆశగా కలలు కంటున్నాం. రోజూ భయపడి బతికే కంటే వేరే చోటుకు వెళ్లడం మంచిదనే అభిప్రాయం అందరిలో ఉంది. కానీ, ఎక్కడికీ వెళ్ల లేని పరిస్థితి. పేదవాళ్లం

\- దానయ్య నివాసితుడు

మేయర్‌ను సత్కరించిన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు


మేయర్ పీలా శ్రీనివాసరావును సత్కరిస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

వెంకోజీపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పీవీవీ నాగరాజు, జనరల్ సెక్రటరీ ఎం.సంజీవరెడ్డి, అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మేయర్ ఛాంబర్‌లో విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలను తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను దక్కించుకున్న జీవీఎంసీ కాంట్రాక్టర్లు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి విశాఖ నగరాభివృద్ధికి సహకరించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఇప్పటికే పనులను పూర్తి చేసి, మిగిలిన పనులను ప్రారంభించేందుకు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను మంజూరు చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ కాంట్రాక్టర్లు మేయర్‌ను కోరారు. దీనిపై మేయర్ స్పందిస్తూ సంబంధిత కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల విడుదలపై కలెక్టర్‌తో చర్చించి బిల్లును అందించే ఏర్పాటు చేస్తానని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాల్సిందిగా జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులను కోరారు. కార్యక్రమంలో పలువురు జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగ పురుష విద్యార్థులకు వసతిగృహంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

పెదవాల్తేరు, మే 16 (ఆంధ్రజ్యోతి) :విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహంల 2025-26 సంవత్సరానికి నాలుగో తరగతి నుండి డిగ్రీ వరకు చదువుతున్న దివ్యాంగుల విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. పెదవాల్తేరు, పెందుర్తిలో గల వసతి గృహాల్లో ప్రవేశం కోరే విద్యార్థులకు ఉచిత భోజనం, వసతితో పాటు కాస్మోటిక్స్, యూనిఫారాలు, నోటు పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగ పురుష విద్యార్థులు వైద్య ధ్రువపత్రం, టీసీ, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, విద్యార్థుల రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో వసతి గృహాల వార్డెన్‌లను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం విశాఖపట్నం వసతిగృహం వార్డెన్ ఫోన్ నెం.94414 66347, పెందుర్తి వసతి గృహం వార్డెన్ ఫోన్ నెం.95054 94632 లో సంప్రదించాలని కోరారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 4 వినతులు


వినతులు స్వీకరిస్తున్న సిటీ ప్లానరు కె.ధనుంజయ్‌రెడ్డి

వెంకోజీపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 4 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ సిటీ ప్లానరు కె.ధనుంజయ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగాటౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమాన్నినిర్వహించారు.

నగరాన్ని పర్యావరణహితంగా మార్చుదాం

- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండుటెండలు విపరీతంగా ఉన్నందున వేసవి తాపానికి నగర ప్రజలు గురి కాకుండా ఉండేందుకు జీవీఎంసీ అన్ని జోన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడమైనదని, అలాగే వేసవి తాపానికి నగర ప్రజల గురి కాకుండా జీవీఎంసీ పలు పర్యావరణహిత పరమైన చర్యలను చేపడుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జోన్-4లో గల జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమీపంలో పర్యావరణహిత చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రానికి వచ్చిన ప్రజలకు చల్లని తాగునీటిని స్వయంగా మేయర్ అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవిలో మండుటెండలకు భూమి వేడెక్కి నగర ప్రజలను ఒక్కరివెక్కిరి చేస్తుందన్నారు. ఇప్పటికే జీవీఎంసీ అన్ని జోన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసిందని, జీవీఎంసీతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయని, నగర ప్రజలు వేసవి తాపానికి గురికాకుండా ఇటువంటి చలివేంద్రాలని మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి ప్రజలకు చల్లని తాగునీటిని అందించాలని మేయర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాల నేపథ్యంలో విశాఖ నగరంలో పచ్చదనాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి చెట్లను పెంచుతూ, ప్రతి భవనంపై పచ్చదనాన్ని పెంపొందిస్తూ ఈ నగర చల్లని వాతావరణానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలన్నీరు తద్వారా వేసవి తాపానికి నగర ప్రజలు గురి కాకుండా ఆరోగ్యంగా జీవించగలరని అన్నారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గందం శ్రీనివాసరావు, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి ఈఎన్వీ నరేశ్‌కుమార్, సహాయక ఇంజనీర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నిర్మూలించే దిశగా పయనిద్దాం


మాట్లాడుతున్న ఎంటమాలజీ విభాగం ఏడీ కేవీఎస్ ప్రసాదరావు

సిరిపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూను సమర్థవంతంగా నియంత్రించవచ్చని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మలేరియా కేవీఎస్ ప్రసాదరావు పేర్కొన్నారు. నేషనల్ డెంగ్యూ డే సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అవగాహన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడిస్ దోమలు కుట్టడం కారణంగా డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తుందన్నారు. రానున్న వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణ చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం ద్వారా డెంగ్యూ జ్వరాల వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఫ్రైడే పటిష్టంగా అమలు చేయడం, దోమలు పెరగకుండా ఎటువంటి చర్యలు చేపట్టాలి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని కూడా భాగస్వామ్యం చేయడం ద్వారా దోమల అభివృద్ధిని అరికట్టి జ్వరాల సంఖ్యను బాగా అదుపు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, ఎంపీహెచ్ఈఓ తిరుపతిరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, జీవీఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

18న 'నిశ్శబ్దమా..నీ ఖరీదెంత?' నాటిక స్వర్ణోత్సవ ప్రదర్శన

మద్దిలపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 'నిశ్శబ్దమా..నీ ఖరీదెంతా..?' నాటిక స్వర్ణోత్సవ వేడుక నిర్వహిస్తున్నట్టు తెలుగు కళాసమితి కార్యదర్శి వై.ఎస్.కె.ఎన్. స్వామి తెలిపారు. మద్దిలపాలెంలో శుక్రవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ 14వ జాతీయ స్థాయి తెలుగు నాటిక రచనల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో భాగంగా ఈ వేడుక చేస్తున్నామన్నారు. తెలుగు నాటిక రచనల పోటీకి 35 నాటిక రచనలు వచ్చాయన్నారు. వాటిలో ఉత్తమ రచనగా 'రిక్వెస్ట్', ద్వితీయ నాటికగా 'క్రతువు', తృతీయ ఉత్తమ నాటికగా 'మూగబోయిన సాక్ష్యం' ఎంపికైనట్టు తెలిపారు. ఈ నాటికల రచయితలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. అనంతరం 'నిశ్శబ్దమా..నీ ఖరీదెంతా?' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 25 సంవత్సరాలుగా నాటిక ప్రదర్శనలు నిర్వహిస్తూ బహుమతులు ప్రదానం చేస్తున్న గొలుగూరి వెంకటరెడ్డికి సన్మానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ వేడుకల్లో కళాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మంగరాజు మృతికి సీపీఐ నేతల నివాళి

మద్దిలపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ మాజీ కార్యవర్గ సభ్యుడు బోర మంగరాజురెడ్డి మద్దిలపాలెంలోని స్వగృహంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా శుక్రవారం సీపీఐ నేతలు అతని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు తమ సంతాపం తెలియజేశారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సభ్యుడు పైడిరాజు మాట్లాడుతూ స్థానిక ప్రజల సమస్యలు పరిష్కారానికి మంగరాజు అహర్నిశలు కృషి చేసేవారన్నారు. గత 8 సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి తుది శ్వాస విడిచారన్నారు. నివాళులర్పించి వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రహమాన్, సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్, నాగభూషణం, పడాల గోవింద్, పైల ఈశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్-3** :సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచర పాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 22, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 34, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

బియ్యం కార్డులో మార్పుచేర్పులకు నిబంధనల సడలింపు

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి) : బియ్యం కార్డులో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేయడంలో కొన్ని నిబంధనలను సడలించినట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్ తెలిపారు. కార్డులో ఇంటి యజమాని పిల్లలకు వివాహమైన తరువాత కొత్తగా పేర్లు చేర్చడం, లేదా కొత్తగా కార్డుకు దరఖాస్తు చేయడానికి వివాహ సర్టిఫికెట్, ఫొటో ఉండాలన్న నిబంధనను సడలించామన్నారు. ఈ విషయాన్ని కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు గమనించాలని కోరారు.

రూ.1.3 లక్షలకు జైలులో మామిడి కాపు వేలం

ఆరిలోవ, మే 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్రకారాగారంలో నిర్వహించిన మామిడి తోట బహిరంగ వేలం పాటలో సుమారు రూ.1.30 లక్షలు పలికినట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. సుమారు 5 ఎకరాలలో గల 250 మామిడి చెట్లకు ఈ వేలంపాట నిర్వహించినట్టు చెప్పారు. గత ఆరు సంవత్సరాల నుంచి వీటి వేలం పాట వివరాలను ఆయన వెల్లడించారు.

2020లో రూ.65,000, 2021లో రూ.1,00,000, 2022లో రూ.52,000, 2023లో రూ.1,40,000, 2024లో రూ.80,000, 2025లో రూ.1,30,000 పలికినట్టు చెప్పారు.

బీపీని నిర్లక్ష్యం చేయవద్దు

వెంకోజీపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి: ప్రపంచ బీపీ దినోత్సవం సందర్భంగా శనివారం మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టర్ అశ్విన్‌కుమార్ పాండా బీపీపై నిర్లక్ష్యం తగదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత కాలంలో దీర్ఘకాలిక సమస్యలు బాగా ఎక్కువై పోతున్నాయని, వాటిలో బీపీ కూడా ఒకటన్నారు. బీపీ అనేది ఒక్కసారి వచ్చిందంటే జీవితంలో మళ్లీ తగ్గనే తగ్గదన్నారు. కేవలం పెరగకుండా మాత్రమే అందరూ మందులు వాడతారన్నారు. అధిక బీపీ వలన గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ బీపీ వలన చాలా మంది హార్ట్ ఎటాక్‌కి గురై చనిపోతున్నారని, అందుకే ఇలాంటి సమస్యలు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కేంద్ర కారాగారంలో రూ.10 కోట్లతో అదనపు బ్యారెక్స్ నిర్మాణం

- సూపరింటెండెంట్ మహేశ్‌బాబు

ఆరిలోవ, మే 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో అదనపు బ్యారెక్స్ నిర్మాణానికి సన్నహాలు చేస్తున్నట్టు కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.10 కోట్లు కేటాయించినట్టు తెలిపారు ఈ నిధులతో సుమారు 200 మంది ఖైదీలకు సరిపడే విధంగా నూతన బ్యారెక్స్ నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు, ఈ భవన నిర్మాణానికి టెండర్లు కూడా పిలవడం జరిగినట్టు తెలిపారు.. దీనిని పోలీసు హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభం ప్రారంభమవుతాయన్నారు. ప్రస్తుతానికి ఈ కేంద్రకారాగారంలో సుమారు 900 మంది ఖైదీలు ఉండడానికి సరిపడుతుందని, కానీ ప్రస్తుతం 1800 మంది ఖైదీలు ఉంటున్నారని తెలిపారు స్థ లాభావం వల్ల రెండు నెలల క్రితం రాజమండ్రికి సుమారు 170 మంది ఖైదీలను పంపినట్టు ఆయన తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా వాహనాల పార్కింగ్



మద్దిలపాలెం ప్రాంతంలో జాతీయరహదారిపై వాహనాల పార్కింగ్ చేసిన స్థలాన్ని విడిచిపెట్టి వేసిన రోడ్డు

మద్దిలపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్ చేయడం కొత్త రోడ్డు నిర్మాణాలకు ఆటంకంగా మారాయి. వాహనాలను తీయడానికి వీలుపడక పక్క నుంచి రోడ్డు నిర్మాణాలు చేయాల్సివస్తోంది. దీనివల్ల రోడ్డు పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. జాతీయ రహదారి నూతన రోడ్డు నిర్మాణాల్లో భాగంగా మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్ వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో ఎక్కువగా సెకెండ్ హ్యాండ్ కార్ల షోరూమ్‌లు ఉన్నాయి. ఆయా షోరూమ్ కార్లు జాతీయ రహదారిపై పార్కింగ్ చేస్తున్నారు. స్థానిక నివాసులు కూడా కార్లను జాతీయ రహదారి పైనే పార్కింగ్ చేస్తున్నారు. అయితే గత పదిహేను రోజుల నుంచి నూతన రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ట్రాఫిక్ దృష్ట్యా అర్థరాత్రి రోడ్డు పనులు చేస్తున్నారు. అప్పటికే రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేసి యజమానులు వెళ్లిపోతున్నారు. అర్థరాత్రి రోడ్డు పనులు జరుగున్నాయని తెలిసినా కూడా వాహనాలను అక్కడే పార్కింగ్ చేయడం పనులకు ఆటంకంగా కలుగుతోంది. చేసేది లేక రోడ్డు వేస్తున్న వారు వాహనాలు పార్కింగ్ చేసిన ప్రదేశాన్ని విడిచి పెట్టి రోడ్డులు వేశారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ఎత్తు పల్లాల రోడ్డులతో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. సంబంధిత అధికారులు వాహనాలు తొలగించి పూర్తిస్థాయి రోడ్డు నిర్మాణాలు చేయాలని కోరుతున్నారు.

ఐటీ విద్యార్థులకు బూట్ క్యాంపులు


శిక్షణకు వచ్చిన విద్యార్థులతో నిర్వాహకులు

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐటీ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను అందించడంలో విద్యా సంస్థలు వెనకబడి ఉన్నందున విద్యార్థులకు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు నేర్పించేందుకు డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఐటీ రంగానికి చెందిన ప్రముఖులతో వారాంతపు బూట్ క్యాంపులు, ఖర్చు లేని శిక్షణ వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రేసపువానిపాలెంలోని టెక్ మహీంద్రా ఆవరణలో కొంతమంది విద్యార్థులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది. దీనికి ఎస్‌టీపీఐ అడిషనల్ డైరెక్టర్ సురేశ్ బేతా హాజరై వారికి ఐటీ రంగంపై, అవసరమైన శిక్షణపైనా అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సంస్థ ఛైర్మన్ శ్రీధర్ కొసరాజు అధ్యక్షత వహించగా డబ్ల్యుఎన్‌స్ ప్రతినిధి ఆర్‌ఎల్ నారాయణ, టెక్ మహీంద్ర ప్రతినిధి జి.మురళీకృష్ణ, డైరెక్టర్ శ్రీహరి హాజరయ్యారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగిస్తాం

» మౌలిక వసతుల కల్పన లక్ష్యం » ప్రభుత్వ రాయితీ ద్వారా రూ.44 కోట్ల పన్నులు వసూలు » ఆంధ్రజ్యోతితో జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

డాబాగార్డెన్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్ నుంచి ఎల్ఐసీ, జగదాంబ, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగిస్తామని, త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ చేపడతామని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. కొందరు షాపుల్లో ఉంటూనే ఫుట్‌పాత్‌లపైకి వచ్చి దుకాణాలకు సంబంధించి స్టాండింగ్ ఫ్లెక్సీలు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీన్ని తీవ్రంగా పరిగణిస్తామని చెప్పారు. జోన్-4 పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఆంధ్రజ్యోతి ఆయనను ప్రశ్నించగా జోనల్ కమిషనర్ ప్రజలకు కనీస వసతుల కల్పన లక్ష్యంగా యంత్రాంగంతో పనిచేయిస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన పన్ను రాయితీ అవకాశాన్ని చాలా మంది ఉపయోగించుకోవడంతో సుమారు రూ.44 కోట్ల పన్నుల బకాయిలను వసూలు చేసినట్లు మల్లయ్యనాయుడు చెప్పారు. మరికొన్ని వివరాలు ఆయన మాటల్లోనే..దక్షిణ నియోజకవర్గంలో 28 నుంచి 39 మొత్తం (12) వార్డులలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఉదయం, రాత్రి సమయాల్లో రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ కార్మికులతో రహదారులను శుభ్రం చేయిస్తున్నాం. క్లాప్ వాహనాలు వెళ్లలేని ప్రాంతాలకు కార్మికులు వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. వార్డుల్లో దోమల నివారణకు పొగకొడుతున్నాం. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తున్నాం. నిరుడు జూన్ 15న సూర్యాబాగ్ జోనల్-4 కార్యాలయంలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు 916 ఫిర్యాదులు రాగా, 871 పరిష్కరించాం. టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు రావడాన్ని గమనించి సిబ్బందిని అప్రమత్తం చేశాం. వేసవిలో ఆహ్లాదం కోసం పార్కులకు వచ్చే సందర్శకులను దృష్టిలో ఉంచుకుని హైమాస్ట్ దీపాలు వెలిగేలా చూస్తూ, ఆయా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షిస్తున్నాం. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ విశాఖ కార్యక్రమాన్ని అన్ని పార్కుల్లో పక్కాగా అమలు చేయడంలో భాగంగా ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చైతన్య పరుస్తున్నాం. అనేక ప్రాంతాల్లో చెట్ల మొదళ్ల దగ్గర వ్యర్థాలు వేస్తున్నట్లు గమనించాం. ఇకపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వేసవిలో చెట్ల కింద సేదతీరేందుకు ప్రజలు వస్తుంటారు. మట్టి తప్ప మరేమీ లేకుండా చర్యలు తీసుకుంటాం.వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇంతవరకు మొత్తం 42 చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తి తీరుస్తున్నాం. 31, 32, 33 వార్డుల్లోని కొన్ని ప్రాంతాల్లో మంచినీటి దార తక్కువగా వస్తోంది. ఎంజీఎం వద్ద పురాతనమైన తాటిపూడి పైపులైన్ వ్యవస్థను మార్చడం ద్వారా ఈ సమస్య నుంచి బయటపడవచ్చని గుర్తించాం. కొండవాలు ప్రాంతాలైన బంగారమ్మమెట్ట, వెంకటేశ్వరమెట్ట, హరివీధి తదితర ప్రాంతాలకు ఈసారి పూర్తిస్థాయిలో నీరు వస్తోంది. నిరుడు దాదాపు రూ.28.5 కోట్లు వసూలైన పన్నుల మొత్తం ఈసారి ప్రభుత్వం రాయితీ ప్రకటించడంతో సుమారు రూ.44 కోట్లకు పెరిగింది. మొండి బకాయిలను వసూలు చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు వివరించారు.


సరస్వతి పార్కులో పరిశుభ్రత అవసరం


ఎం.మల్లయ్యనాయుడు, జోనల్ కమిషనర్

నేడు 50వ వార్డులో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

మాధవధార, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం 50వ వార్డులో అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్లు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్క్ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, జోన్-5 జెడ్సీ, ప్రజారోగ్య విభాగం సహా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరుకానున్నట్లు తెలిపారు. వైశాఖ స్పోర్ట్సు పార్క్ నుంచి ఉదయం 6.30 గంటలకే కార్యక్రమం ఆరంభం అవుతుందని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అక్కయ్యపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రాన్ని పంపారు. గత ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలను, మున్సిపల్ పాఠశాలలను బలవంతంగా ప్రభుత్వంలో విలీనం చేసి, ఉపాధ్యాయుల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోకుండా, వారిని మానసిక ఆందోళనకు గురిచేసిందన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.

కౌమార దశపై అవగాహన అవసరం

మురళీనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వవార్డు మాధవధార గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. టీం కన్వీనర్ వరలక్ష్మి మాట్లాడుతూ వేసవి శిబిరంలో 16 ఏళ్లలోపు బాలికలు పాల్గొనాలని సూచించారు. ఆరోగ్య పరంగా ఎదురయ్యే సమస్యలు, రక్తహీనత, ఇతర ఇబ్బందులపై చర్చిస్తామన్నారు. అంగన్వాడీ టీచర్ మౌల బీబీ, ఏఎన్ఎం స్రవంతి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

సీతంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను ద్వారకా ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో గురుద్వార కూడలి నుంచి సీతంపేట కూడలి వరకు పలు దుకాణాలను, చిరు వ్యాపారాలు సాగిస్తున్న బండ్లను తొలగించారు.

జనసేన సభ్యత్వ కార్డుల పంపిణీ

మహారాణిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ సభ్యత్వాలు భారీగా జరుగుతున్నాయని ఆ పార్టీ దక్షిణ నియోజకవర్గం నాయకుడు మన్యాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మహారాణిపేటలోని జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద పార్టీ సభ్యత్వాలు చేపట్టడంతో పాటు నమోదు చేసుకున్న వారికి కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా జనసేన గొప్ప కార్యక్రమాన్ని తలపెట్టిందని, క్రియాశీలక సభ్యత్వాలతో కార్యకర్తల్లో భరోసా నింపుతున్నారని చెప్పారు. జనవాణి ద్వారా ఎమ్మెల్యే వంశీకృష్ణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

పర్యాటక, గృహ నిర్మాణ ప్రాజెక్టులపై సమీక్ష

మహారాణిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆయా శాఖల ప్రగతిపై శుక్రవారం సమీక్షించారు జిల్లాలో పర్యటక ప్రాజెక్టుల స్థితిగతులను కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆయనకు వివరించారు. అనంతరం ఔత్సాహిక కంపెనీలకు భూ కేటాయింపులు, ప్రభుత్వ సహకారం, సాంకేతిక ప్రక్రియ ఇతర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అన్నవరం వద్ద నిర్మించనున్న ఒబెరాయ్,ఫేయిర్ గ్రూప్ హోటల్ నిర్మాణాలకు సంబంధించిన స్థలాలను పరిశీలించారు,

స్వయంశక్తి సంఘాల తీరుపై ఆరా

... 5వ పేజీ తరువాయి

తమ కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న సంఘాలకే డిపోలను కేటాయించుకున్నారని గుర్తు చేస్తున్నారు. కరోనా సమయంలో జిల్లాలో ఖాళీగా ఉన్న పలు రేషన్ డిపోలకు డీలర్లను కేటాయించడానికి ఇబ్బందులు వచ్చాయి. రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించడం సాధ్యం కానందున స్వయంశక్తి సంఘాలకు సుమారు 60 డిపోలను తాత్కాలిక ప్రాతిపదికన 2020లో కేటాయించారు. ఎప్పుడైనా నోటిఫికేషన్ విడుదల చేసి ఆయా డిపోలకు డీలర్లను నియమించుకునే అధికారం పౌరసరఫరాల శాఖకు ఉందని అప్పట్లోనే అధికారులు స్పష్టం చేశారు. అయితే అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ నేతలకు అనుకూలంగా ఉన్న సంఘాలకే ఎక్కువ డిపోలను కేటాయించారని ఆరోపణలు వచ్చాయి. నగరంలో ఎక్కువ డిపోలు నిర్వహిస్తున్న బినామీలు కొందరు తమ కుటుంబ సభ్యులను స్వయంశక్తి సంఘాల్లో సభ్యులుగా చేర్పించి వైసీపీ నేతల సిఫారుసుతో డిపోలను చేజిక్కించుకున్నారు. అటువంటి డిపోలను బినామీలు నిర్వహిస్తుండగా, మరికొన్ని సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. రేషన్ బియ్యం విక్రయిస్తున్న ముఠాల వలలో పడిన కొన్ని స్వయంశక్తి సంఘాలు అక్రమాలకు పాల్పడడంతో వారిపై పౌరసరఫరాల అధికారులు కేసులు నమోదు చేశారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే డిపో డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేస్తే డీలర్ల సంఘ నేతలు, బినామీలు అడ్డుకున్నారు. నగరంలో 36 స్వయంశక్తి సంఘాలతో కోర్టులో పిటిషన్ దాఖలు చేయించగా స్టే వచ్చింది. సుమారు ఏడాదిన్నరగా స్టే కొనసాగుతోంది. ఇందుకు సంబంధించి కౌంటర్ వేయకుండా పౌరసరఫరాల శాఖ కమిషనరేట్‌లో గతంలో పనిచేసిన అధికారులను మేనేజ్ చేశారనే ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలిసిన ప్రస్తుత కమిషనర్ విశాఖ జిల్లాలో స్వయంశక్తి సంఘాల పనితీరు, కేసు వ్యవహారంపై ఆరా తీశారు. కాగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం పలు స్వయంశక్తి సంఘాల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాటిపై నిఘా పెట్టినట్టు తెలిసింది. దీనిపై రేషన్ డీలర్ల సంఘ నేతలు తాజాగా జిల్లా అధికారులను కలిసి మాట్లాడేందుకు ప్రయత్నిస్తే వారు గట్టిగా హెచ్చరించారని కొందరు డీలర్లు చెబుతున్నారు.

పూర్తిస్థాయిలో మౌలిక వసతులు

కంచరపాలెం/మర్రిపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 54వవార్డు పరిధి వివేకానందవీధి, జ్యోతినగర్ తదితర ప్రాంతాల్లోని పార్కుల్లో నూతన వసతుల కల్పనకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ సుమారు రూ.50 లక్షలతో పిల్లల పార్కు, రోడ్లు, నూతన వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగక, తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడ్డారన్నారు. ప్రజలకు అత్యంత అవసరమైన వీధిదీపాలు, తాగు నీరు, పారిశుద్ధ్యం తదితర సదుపాయాలను శతశాతం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్, జడ్సీ రాము,బీజేపీ వార్డు అధ్యక్షుడు రంగుముద్ర రాంబాబు, పెంటకోట స్రవంతి, జి.అరుణ్, నాయకులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు

ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడండి

సీతంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి చుట్టు పక్కల దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలు ఉన్నాయేమో పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారులు సూచించారు. జీవీఎంసీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా అధికారులు, సిబ్బంది శుక్రవారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి బుల్లయ్య కళాశాల పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని, వాటి ద్వారా మలేరియా, డెంగ్యూ, చికిన గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమల వ్యాప్తి అరికట్టడానికి ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జోనల్ మలేరియా కార్యాలయ డైరెక్టర్ కేవీఎస్ ప్రసాదరావు, జిల్లా మలేరియా అధికారిణి ఎం.తులసి పాల్గొన్నారు.

20 నుంచి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

మహారాణిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం, స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు ఈనెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు తెలిపారు. శుక్రవారం ఆయన సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకపోగా, ప్లాంట్‌ను ఆర్సిలార్ మిట్టల్‌కు కట్టబెట్టాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ నిధులను ప్లాంట్ అప్పులు తీర్చడానికి ఉపయోగిస్తున్నారని కానీ ప్లాంట్ అభి వృద్ధికి, కార్మికుల జీతాలు చెల్లింపునకు వినియోగించడం లేదని చెప్పారు. గత ఐదేళ్లుగా కార్మికుల పోస్టులు భర్తీ చేయడం లేదని, వీఆర్ఎస్ పేరుతో 1213 మంది ఉద్యోగులను తొలగించారని తెలిపారు. పని భారం తీవ్రంగా ఉందని, నాలుగు మెషన్ల వద్ద ఒక్క కార్మికుడు పని చేస్తున్నాడన్నారు. కార్మికులు కనీసం సమావేశాలు నిర్వహించుకోవడానికి కూడా ఆంక్షలు విధిస్తున్నారని, షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారని విమర్శించారు. ఈనేపథ్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీటూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, కెఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

ప్రజాప్రతినిధుతో జడ్సీ సమావేశం

జ్ఞానాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లను పరిపాలనా సౌలభ్యం కోసం అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాతిపదికన విభజన చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలపై జోన్-5 కమిషనర్ బి. రాము ప్రజాప్రతినిధుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. శుక్రవారం ఆయన జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ సిటిజన్ల నుంచి ప్రభుత్వం ప్రతిపాదనపై సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జోన్-5 కార్యాలయం పశ్చిమ, ఉత్తర, దక్షిణం, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉండడంతో పలు సమస్యలు ఉన్నాయని తెలిపారు. 45, 42వ వార్డులను ఉత్తర నియోజకవర్గంలో ఉంచాలని,జోన్లు విభజన చేస్తే 45వ వార్డులోని కొన్ని ప్రాంతాలను భీమిలి జోన్‌కు, 42వ వార్డులోని కొన్ని ప్రాంతాలను దక్షిణం జోన్‌కు వెళ్లాల్సి వస్తుందని, ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ టీపీఓ ప్రవీణ్, జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ సీనియర్ నాయకులు సనపల వరప్రసాద్, కార్పొరేటర్లు, టీడీపీ, జనసేన వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

విశాఖలో రైల్వే ఏజీఎం తనిఖీలు


అధికారులతో సమీక్షిస్తున్న ఏజీఎం మోహెస్‌కుమార్

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే అదనపు జనరల్ మేనేజర్ మోహెస్‌కుమార్ బెహరా శుక్రవారం విశాఖలో తనిఖీలు చేశారు. రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఆలిండియా గార్డ్సు కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార్డులు, ఇతర సిబ్బంది నిర్వహించే కీలక బాధ్యతలు, భద్రత వంటి పలు అంశాలపై మాట్లాడారు. రైల్వే యాజమాన్యం చేపట్టాల్సిన చర్యలు, కల్పించాల్సిన సదుపాయాలపై చర్చించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేసిన అనంతరం డీఆర్ఎం కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పరిశుభ్రత, సరుకు రవాణా లోడింగ్, సురక్షితమైన రైలు కార్యకలాపాలు, ట్రాక్ నిర్వహణ వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించడమే కాకుండా తగిన భద్రత, నిర్వహణ చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు.

ఫ్రైడే!

... 5వ పేజీ తరువాయి

వంటిని కప్పుకుని కనిపించారు.

ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు భానుడి ప్రతాపానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అత్యవసరమైతే తప్పా బయటకు వచ్చేందుకు ఎవరూ సాహసించలేదు. ఉదయం 11 గంటల తరువాత నుంచి పలుచోట్ల వేడి గాలులు వీయడంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు నానాపాట్లు పడ్డారు. ఎండ వేడిమి నుంచి సేదతీరేందుకు ఫ్యాన్లు, ఏసీలను ఎక్కువగా వినియోగించారు. ఆరుబయట పనిచేసేవాళ్లు చెట్ల కిందకు చేరిపోయి ఉపశమనం పొందే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నందున చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎండ, వేడి గాలుల నుంచి సేదతీరేందుకు సాయంత్రం ఐదు గంటల తరువాత అధిక శాతం మంది సాగరతీరాలకు చేరుకున్నారు. పలువురు సముద్రంలో స్నానాలు చేస్తూ గడిపారు.

నడిరోడ్డుపై వైసీపీ నేత జన్మదిన వేడుకలు

» మాజీ కార్పొరేటర్ హనుమంతురావుతో పాటు మరికొందరిపై కేసు నమోదు

కొమ్మాది, మే 16 (ఆంధ్రజ్యోతి) : నడి రోడ్డుపై పుట్టినరోజు వేడుకలు జరిపి, హంగామా చేసిన వైసీపీ మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి నట్టు పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపారు. గురువారం రాత్రి మధురవాడ ఐటీ సెజ్ మార్గంలోని మ్యాగి కూడలి వద్ద పోతిన హనుమంతురావు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు జరి పారు. రోడ్డుపై కేక్ కట్ చేయడంతో పాటు పెట్రోల్‌తో మంటలు వేసి, బాణసంచా కాల్చడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బందులు పడ్డారు. ఈ దృశ్యాలను కొందరు వీడియో తీసి నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చీకి వాట్సాప్‌లో ఫిర్యాదు చేయడంతో తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన పీఎంపాలెం పోలీసులను ఆదేశించారు. సీఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి హంగామా చేస్తున్న వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించారు. సీపీ ఆదేశాల మేరకు హనుమంతురావుతో పాటు మరికొంతమందిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు. వీడియోను పరిశీలించి, మిగిలిన వారిపై కూడా కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ సంచులు స్వాధీనం.. వ్యాపారులకు రూ.2 వేల జరిమానా

సీతమ్మధార, మే 16 (ఆంధ్రజ్యోతి): పదే పదే హెచ్చరించినా ప్లాస్టిక్ వాడుతున్న చిరు వ్యాపారుల నుంచి మూడు కేజీల సంచులను జీవీఎంసీ అధికారులు సీజ్ చేశారు. వ్యాపారులకు రూ.2 వేల జరిమానా విధించారు. 24వ వార్డులో ఓల్డ్ రేసపువానిపాలెం, సీఎంఆర్ పక్కన ఉన్న స్ట్రీట్ వెండర్స్ షాపులకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సెక్రటరీలు మోహన్, పద్మజ, షరాన్, సతీష్‌లు తనిఖీలు నిర్వహించారు. జీవీఎంసీ సూపర్‌వైజర్లు కోట రమణ, మణి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

88 ఎకరాల అభివృద్ధికి జాయింట్ వెంచర్ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

వారికి అభివృద్ధి చేసిన దాంట్లో తగిన వాటా ఇస్తామని, ఇరు వర్గాలకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ జాయింట్ వెంచర్ ప్రాజెక్టు కోసం ఈ నెల 23న హైదరాబాద్‌లో, 30న బెంగళూరులో రోడ్ షోలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేశ్, సెక్రటరీ మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్ఈలు భవానీశంకర్, బలరామరాజు, పీవోలు వెంకటేశ్వరరావు, అరుణవల్లి, చామంతి, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాలో గోల్‌మాల్?

... 5వ పేజీ తరువాయి

చేసుకున్నారు. మిగిలిన వాటిలో 3,342 ఇళ్లకు పునాదులు తవ్వగా, సుమారు 24 వేల ఇళ్ల పునాదుల వరకు, 20,400 ఇళ్లకు పునాదులు పూర్తి చేయగా..మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కేంద్రం ఇచ్చే పీఎంఏవై నిధులు రూ.1.8 లక్షలతో చేపట్టే ఇళ్లకు ముందు గోడను మాత్రమే ప్లాస్టింగ్ చేస్తారు. దీనికి కూడా ఐదు టన్నుల వంతున ఇసుకను సరఫరా చేస్తున్నారు. అదే డ్వాక్రా సంఘం నుంచి ఇచ్చే రూ.35 వేలు అందితే మొత్తం ప్లాస్టింగ్ చేస్తారు. దీనికి అనుగుణంగానే ఇసుక సరఫరా చేయాలి. శ్లాబ్ వరకు 15 టన్నులు సరఫరా చేసిన అధికారులు.. మొత్తం ఇళ్ల పూర్తికి మిగిలిన ఐదు టన్నుల సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటివరకు పూర్తిచేసిన 38 వేల ఇళ్లలో రూ.1.8 లక్షలు, రూ.2.15 లక్షలు కేటాయించినవి ఉన్నాయి. ఈ రెండింటికీ ఒకేలా 20 టన్నుల వంతున ఇసుక సరఫరా చేశారు.ఇంటి ముందు గోడ ప్లాస్టింగ్ చేయడానికి ఐదు టన్నుల ఇసుక అవసరం లేదు. అయినా కాంట్రాక్టర్లు ఇండెంట్ పెట్టిన వెంటనే ఇసుక కోసం ఆన్‌లైన్‌లో ఇన్ వాయిస్‌లో జనరేట్ చేస్తున్నారు. మరో విశేషమేమిటంటే.. సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణానికి 13 టన్నుల ఇసుక సరిపోతుందని నగరంలో ప్రైవేటు ఇళ్లు నిర్మిస్తున్న సివిల్ ఇంజనీర్ ఒకరు తెలిపారు. అటువంటిది సెంటు స్థలంలో నిర్మించే ఇంటికి 20 టన్నుల్లో ఐదారు టన్నుల వరకు మిగులుతుందన్నారు. ఇదిలావుండగా రీచ్‌ల నుంచి వచ్చే ఇసుక లోడుల్లో కొన్నింటిని మధ్యలోనే దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక సరఫరా విషయంలో కాంట్రాక్టర్లకు కొందరు ఏఈలు అడ్డగోలుగా సాయపడుతున్నారనే వాదన ఉంది. లేఅవుట్లలో ఇసుక నిల్వలు, వినియోగంపై లెక్కలు తేల్చకుండా కాంట్రాక్టర్లు ఇచ్చిన సొమ్ముతో కొందరు అధికారులు జేబులు నింపుకుంటున్నారనే ఫిర్యాదులున్నాయి. ఇసుక వినియోగంపై వారం, పది రోజుల క్రితం జిల్లాకు వచ్చిన ఉన్నతాధికారి చేసిన హెచ్చరికతో అధికారులు అప్రమత్తం అవుతారా? అనేది అనుమానమేనని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేసే ఇసుక వినియోగంపై సమగ్ర విచారణ చేపడితే గుట్టురట్టు అవుతుందని రిటైర్డు హౌసింగ్ అధికారి వ్యాఖ్యలు చేశారు.

ఆ 88 ఎకరాల్లోనే ఫిన్‌టెక్ సిటీ!

... 5వ పేజీ తరువాయి

సిటీగా ప్రకటించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐటీని పట్టించుకోకపోవడంతో రుషికొండలోని ఫిన్‌టెక్ సంస్థలు ఒక్కొక్కటిగా వెళ్లిపోయాయి. ఇప్పుడు అద్దె భవనాల్లో కాకుండా సొంతంగానే రాష్ట్ర ప్రభుత్వం 'ఫిన్‌టెక్ సిటీ'ని నిర్మించాలని ప్రణాళిక రూపొందిస్తోంది. ఇది కార్యరూపం దాల్చడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

మొదటి వారంలో టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, స్టార్టప్‌లకు అండగా ఉండడానికి 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'ను ప్రభుత్వం అమరావతిలో నెలకొల్పింది. దీనికి అనుబంధంగా మరో ఎనిమిది రీజనల్ కేంద్రాలను ప్రకటించింది. వీటిని అభివృద్ధి చేసే బాధ్యతలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించింది. విశాఖలో రీజనల్ హబ్‌ను జీఎంఆర్ గ్రూపునకు ఇచ్చారు. ఇందుకోసం వీఎంఆర్డీఏ సిరిపురం జంక్షన్‌లో కొత్తగా నిర్మించిన 'ది డెక్' భవనంలో ఒక అంతస్థును కేటాయించారు. దీనికి అవసరమైన మౌలిక వసతుల కోసం తాజాగా ప్రభుత్వం రెండు కోట్ల రూపాయలను విడుదల చేయడంతో ఇంటీరియర్ పనులను ప్రారంభించారు. దీనిని జూన్ మొదటి వారంలో ప్రారంభించే అవకాశం ఉందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి శుక్రవారం తెలిపారు.

జిల్లాకు ఐటీ మేనేజర్ ఏరీ?

ప్రతి జిల్లాలో ఐటీ వ్యవహారాలను పర్యవేక్షించడానికి ఒక మేనేజర్‌ను నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. విశాఖపట్నంలో గతంలో టెక్ మహీంద్రాలో ఏపీటా కార్యాలయం ఉండేది. అధికారులు కూడా ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారిని తొలగించింది. ఆ తరువాత రుషికొండ స్టార్టప్ విలేజ్‌లో జాయింట్ డైరెక్టర్ కేడర్‌లో ఒక మహిళ పనిచేసేవారు. ఆమె కూడా ఇప్పుడు లేరు. ఐటీ సంస్థలకు రావాల్సిన రాయితీ బకాయిల కోసం సంప్రతించడానికి కూడా ఎవరూ లేరు. అందువల్ల తక్షణమే ఒక మేనేజర్‌ను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెరిగిన విద్యుత్ వినియోగం

... 5వ పేజీ తరువాయి

సరఫరాలో ఊహించని ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లకు ప్రతి శుక్రవారం నిర్వహణ పనులు చేపడుతున్నామని, అందులో భాగంగా శుక్రవారం కొన్నిచోట్ల అంతరాయం ఏర్పడిందన్నారు. అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల గురువారం రాత్రి పెనుగాలులతో వర్షం కురిసిందని, దీంతో మాడుగుల మండలం సత్యవరంలో 20 ఎల్‌టీ స్తంభాలు, ఏడు హెచ్‌టీ స్తంభాలు విరిగి పడిపోయాయని ఆయన చెప్పారు. డి.గొట్టివాడ, సాగరం, కొత్తవలస, కె.వేలంపాడు గ్రామాల్లో 1,600 సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందన్నారు. వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి శుక్రవారం ఉదయం పది గంటలలోకల్లా సరఫరాను పునరుద్ధరించామన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి పరిధిలోని శాలిపేటలో గురువారం రాత్రి పది గంటల సమయంలో భారీ లోడుతో వెళుతున్న వాహనం స్తంభాలను లాగేసిందని, దాంతో ఆరు ఎల్‌టీ స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ కారణంగా గజపతినగరం, మెంటాడ మండలాల్లో 264 సర్వీసులకు విద్యుత్ అంతరాయం కలిగిందన్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ అందించామన్నారు.

విశాఖలో లోడ్ మానిటరింగ్ సెల్

విద్యుత్ సరఫరాలో వచ్చే అంతరాయాలను గుర్తించేందుకు విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయంలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షిస్తున్నామని సూర్యప్రకాశ్ చెప్పారు. డివిజన్ స్థాయిల్లో సైతం ఇలాంటి మానిటరింగ్ సెల్స్ పనిచేస్తున్నాయని, విద్యుత్ సమస్యలు ఏమున్నా 1912 నంబరుకు ఫోన్ చేసి చెప్పాలని ఆయన సూచించారు.

ఇక బస్టాపుల్లోనే పార్శిళ్ల బుకింగ్

... 5వ పేజీ తరువాయి

శ్రీకాకుళానికి రాకపోకలు సాగించే బస్సుల్లో, జోనల్ పరిధిలోని నాన్‌స్టాప్, సింగిల్ స్టాప్ సర్వీసుల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. బస్సులు ఆగే అన్ని కేంద్రాల్లోనూ డ్రైవర్లు పార్శిళ్లను బుక్ చేసుకుంటారు.

డ్రైవర్లకు శిక్షణ

యూటీఎస్ మిషన్‌ను వినియోగించే విధానంపై ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నారు. మొదటి దశలో దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే డ్రైవర్లకు శిక్షణను అందిస్తున్నారు. రీజియన్ పరిధిలోని మధురవాడ, విశాఖపట్నం, మద్దిలపాలెం, వాల్తేరు, సింహాచలం, గాజువాక, స్టీల్ సిటీ డిపోల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే 50 మంది వరకు డ్రైవర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారికి కూడా దశలవారీగా శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు.

వచ్చేనెల ఒకటి నుంచి అమలులోకి..

ఈ విధానం వచ్చేనెల ఒకటి నుంచి అమలులోకి తీసుకురావాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. తొలుత హైదరాబాద్, విజయవాడ, భీమవరం, చెన్నై బస్సుల్లో అమలు చేసి, దశలవారీగా అన్ని దూర ప్రాంత సర్వీసుల్లో, జోనల్ పరిధిలో తిరిగే బస్సుల్లోనూ అమలు చేస్తారు. దీనివల్ల పార్శిళ్లు బుకింగ్ చేసుకునే వారికి సమయం ఆదా అవుతుంది.

ఘనంగా సంకటహర చతుర్థి వేడుకలు

అగనంపూడి, మే 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి జాబిలిహిల్స్ కాలనీలో గల వినాయక ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో సంకటహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తి, గీతాలు, భజనా కార్యక్రమాన్ని జరిపించారు. నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గొల్లవిల్లి కనకభవానీ, వెంకటరావు, ఆంజనేయులు, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం

కూర్మన్నపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88 వార్డు ఎల్ఎన్ గార్డెన్స్ వరసిద్ధి వినాయక ఆలయంలో శుక్రవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు చంద్రమౌళిశర్మ పర్యవేక్షణలో పంచామృత, ఫలరసాభిషేకం, నారికేల జలాభిషేకం, పూర్వక అభిషేకం, ప్రత్యేక గరిక పూజలు నిర్వహించారు. ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు.

టీడీపీ 65వ వార్డు అధ్యక్షుడిగా రట్టి వాసు



నూతన కమిటీని అభినందిస్తున్న రాష్ట్ర పరిశీలకులు ఎంవీఎస్ చౌధురి

గాజువాక, మే 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 65వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా రట్టి వాసు నియమితులయ్యారు. గాజువాక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వార్డు కమిటీ సమావేశంలో వాసును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర పరిశీలకులు ఎంవీఎస్ చౌధురి, గాజువాక పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యక్షుడిగా పోతిన వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి దాట్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా దేవుడులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసంరాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాష్ట్ర ప్రగతి కోసం చేపడుతున్న చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు.

68 వార్డు కమిటీ అధ్యక్షుడిగా తాతారావు

అక్కిరెడ్డిపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ గాజువాక నియోజకవర్గ అబ్జర్వర్ ఎంవీఎస్ చౌధురి ఆధ్వర్యంలో శుక్రవారం 68 వార్డు నూతన కమిటీ ఎన్నుకున్నారు. టీడీపీ గాజువాక కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన క్లస్టర్ ఇన్‌చార్జిగా సర్వసిద్ధి అనంతలక్ష్మి, వార్డు అధ్యక్షుడిగా గండికోట తాతారావు, ఉపాధ్యక్షులుగా లంక మురళి, ప్రధాన కార్యదర్శిగా డొప్ప అప్పలరాజు, సహాయ కార్యదర్శిగా ఎన్‌వి రమణ, తమ్మి రాజు, కోశాదికారిగా పిల్లా అప్పల సత్యారావు ఎన్నికయ్యారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 22, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 34, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 ,నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర (3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 18

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

పుస్తకాలు, బ్యాగులు వచ్చేశాయ్

- పాఠశాలల పునః ప్రారంభం రోజే పంపిణీకి ఏర్పాట్లు
- తొలి రోజు నుంచే పాఠ్యాంశాల బోధనకు విద్యాశాఖ ప్రణాళిక



ఎంఈవో కార్యాలయంలో భద్రపరిచిన పుస్తకాలు



బాగ్యులు, బెల్టుల ప్యాకెట్లు



స్కూళ్లకు సరఫరా చేసేందుకు సిద్ధం చేసిన పుస్తకాలు, బ్యాగులు

పెదగంట్యాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ మండలంలో పాఠశాలలకు సంబంధించిన తరగతి పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూలు బ్యాగులు, విద్యార్థుల బెల్టులు వచ్చేశాయి. వీటిని మండల విద్యాశాఖ కార్యాలయంలో భద్రపరిచారు. పెదగంట్యాడ మండలంలో 32 ప్రాథమిక పాఠశాలలు, 3 జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులు 240 మంది, రెండోతరగతి 240, మూడో తరగతి 236, నాలుగో తరగతి 304, అయిదో తరగతి 313, ఆరోతరగతి 436, ఏడో తరగతి 384 మంది, ఎనిమిదో తరగతి 482, తొమ్మిదో తరగతి 491, పదో తరగతి 555 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి అందరికీ అందజేసేందుకు పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూలు బ్యాగులు, బెల్టులు చేరుకున్నాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పేరిట రాష్ట్ర ప్రభుత్వం వీటిని విద్యార్థులకు అందజేయనుంది.

మండలంలోని ఏ పాఠశాలలో ఎన్ని తరగతుల వరకు ఉన్నాయి. ఒక్కో తరగతిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో మండల విద్యాశాఖాధికారులు లెక్కలు కట్టారు. ఆ మేరకు పుస్తకాలను విభజించారు. అవి ఈ నెలాఖరు నాటికి సంబంధిత పాఠశాలలకు చేరుకోనున్నాయి. నడుపూరు, గంగవరం, ఇస్లాంపేటలలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటికి కూడా పుస్తకాలు పంపేందుకు మండల విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. జూన్ 12న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. అదే రోజున విద్యార్థులకు తరగతి పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూటు బ్యాగులు, బెల్టులు పంపిణీ చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పునఃప్రారంభం రోజునే స్టడీ మెటీరియల్ పంపిణీ

- కె రమణాజీ, మండల విద్యాశాఖాధికారి



విద్యాసంవత్సరంలో ఒక్కరోజు కూడా వృథా కాకూడదన్న ఉద్దేశంతో పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ మొత్తం పంపిణీ చేయాలని నిర్ణయించాం. జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ పుస్తకాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్ ద్వారా వచ్చిన అన్ని తరగతుల పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూలు బ్యాగులు, బెల్టులు మంచి నాణ్యతతో ఉన్నాయి. పాఠశాలల పునఃప్రారంభం రోజునుంచే విద్యార్థులకు పాఠాలు చెప్పాలన్నది జిల్లా విద్యా శాఖ లక్ష్యం.

కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగితే తీవ్ర పరిణామాలు

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ఉక్కుటౌన్‌సిప్, మే 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు యాజమాన్య నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు, కార్మికులకు వ్యతిరేకంగా ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేసే చర్యలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కేంద్రం విశాఖ స్టీల్‌ప్లాంటును విక్రయించాలని చూసినప్పటికీ స్థానికంగా చేసిన పోరాటాల వల్ల కేంద్రం ముందడుగు వేయలేకపోతుందన్నారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీలో ఒక్క రూపాయి కూడా స్టీల్‌ప్లాంటు అభివృద్ధికి గానీ, కార్మికుల జీత భత్యాల కోసం అయిన వినియోగించారా? అని ప్రశ్నించారు. ఏదో సాకుల పేరుతో కార్మికులకు యాజమాన్యం షోకాజ్ నోటీసులు జారీ చేస్తోందని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం మాట్లాడుతూ కార్మికులను భయపెట్టడానికి యాజమాన్యం ప్రయత్నించడం తగదని, ప్రశాంత వాతావరణంలో పని చేసే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, వైటి.దాసు, శ్రీనివాసరాజు, అప్పారావు, రాజు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీలు



గాజువాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

గాజువాక, మే 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గాజువాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం గాజువాకలో డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుధాకర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యపరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. డెంగ్యూ జ్వరాన్ని ముందుగా గుర్తించి నివారణ మందులు వాడితే ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.నాగఅప్పారావు, సిబ్బంది రాము, సురేష్, పాల్గొన్నారు.

తిరుమలనగర్‌లో..

ఆటోనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురష్కరించుకుని జీవీఎంసీ మలేరియా సిబ్బంది, తిరుమల నగర్ కాలనీవాసులు సంయుక్తంగా 87 వార్డులోని కణితి, వడ్లపూడి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం డెంగ్యూ నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యులు శివయ్య, బాబీ, కాలనీవాసులు నాగభూషణం,విశ్వేశ్వరరావు,పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంత రెడ్డి, ఇబ్రహీం, ఏఎన్ ఎం, మలేరియా సిబ్బంది, ఆశాలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీ విద్యార్థులకు బూట్ క్యాంపులు

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఐటీ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను అందించడంలో విద్యా సంస్థలు వెనకబడి ఉన్నాయి. దింతో విద్యార్థులకు పరిశ్రమలో పనిచేసేందుకు అవసరమైన నైపుణ్యాలు నేర్పించేందుకు డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఐటీ రంగానికి చెందిన ప్రముఖులతో వారాంతపు బూట్ క్యాంపులు, ఖర్చు లేని శిక్షణ వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రేసపువానిపాలెంలోని టెక్ మహీంద్రా ఆవరణలో కొంతమంది విద్యార్థులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది. దీనికి ఎస్‌టీపీఐ అడిషనల్ డైరెక్టర్ సురేశ్ బేతా హాజరై వారికి ఐటీ రంగంపై, అవసరమైన శిక్షణపైనా అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సంస్థ ఛైర్మన్ శ్రీధర్ కొసరాజు అధ్యక్షత వహించగా డబ్ల్యుఎన్‌ఎస్ ప్రతినిధి ఆర్ఎల్ నారాయణ, టెక్ మహీంద్ర ప్రతినిధి జి.మురళీకృష్ణ, డైరెక్టర్ శ్రీహరి, తదితరులు హాజరయ్యారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

పెందుర్తి, మే 16(ఆంధ్రజ్యోతి): పెందుర్తిలో ఉన్న టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ హాజరై వివిధ ప్రజాసమస్యలపై 120 అర్జీలను తీసుకున్నారు. అందిన వినతులను శాఖాపరంగా విభజన చేసి వెంటనే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొన్ని సమస్యల గురించి అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ప్రజాదర్బార్‌లో అందిన వినతులు సీఎం దృష్టికి తీసుకెళతామని, సీఎం కార్యాలయం నుంచే సమస్యలు పరిష్కరం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు



అగనంపూడి, మే 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డులో అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబకి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణు సహస్ర నామా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, పారాయణ సేవా సమితి పాల్గొన్నాయి.

93వ వార్డులో మేయర్ విస్తృత పర్యటన



కృష్ణానగర్‌లో కాలువ పరిస్థితిని పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వేపగుంట, మే 16(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో విలీనమైన శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడానికి అధికారులు దృష్టి పెట్టాలని, కాలవులు, రోడ్ల వెడల్పునకు ప్రజలు సహకరించాలని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు కోరారు. జీవీఎంసీ 93వ వార్డులో శుక్రవారం ఉదయం మేయర్ పీలాశ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ రాపర్తికన్నా, గ్రేటర్ ఉన్నతాధికారులు పర్యటించారు. ముందుగా కృష్ణానగర్‌లో లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు చేసి, అనంతరం ఇక్కడ నిర్మిస్తున్న హోమియోపతి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కృష్ణానగర్‌లో రక్షణ గోడలు లేని కాలువలను పరిశీలించారు. దుర్గానగర్, ప్రహ్లాదపురం దగ్గర పల్లినారాయణపురంలో ఉన్న కల్యాణ మండపానికి అదనపు అంతస్తు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, ప్రహ్లాదపురం శ్మశానవాటికలో వసతులు మెరుగుపరచాలని, కోనేరు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మేయర్ అధికారులకు సూచించారు. కాలువలకు రక్షణ గోడలు నిర్మిచాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. ప్రహ్లాదపురంలో అసంపూర్తిగా ఉన్న పనులను 15రోజుల్లో పూర్తిచేసి రహదారుల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. దాదాపు రెండు గంటల పాడు వార్డులో పర్యటించారు. కొందరి ఇళ్లకు వెళ్లి వార్డులో పరిస్థితుల గురించి ఆరాతీశారు. ఈ క్రమంలో ఒక వితంతు ఫించన్ మంజూరు చేయాలని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడారు. సచివాలయాల సిబ్బంది ప్రజలకు సేవలందించటంలో మరింత శ్రద్ధ చూపించాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జోన్ 8 జెడ్సీ కే.హైమావతి, చీఫ్ ఇంజనీర్ సంపత్‌కుమార్, సహాయ వైద్యాధికారి అప్పలనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'సంక్షేమం, అభివృద్ధి' ధ్యేయంగా కూటమి పాలన

- పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు




దీపం సిలిండర్లు అందిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలో దీపం పథకం కింద లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసుత్తం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా 'సంక్షేమం అభివృద్ధి' అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఇచ్చిన హామీలన్నింటిని తప్పక నెరవేరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ కే.హైమావతి, కార్పొరేటర్ బొమ్మిడి రమణ, సివిల్ సప్లేయ్స్ ఆర్.ఐ. లక్ష్మీ, పలువుర కూటమి నాయకులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల దరఖాస్తుకు నిబంధనలు సడలింపు

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డులో మార్పులు కోసం దరఖాస్తు చేయడంలో కొన్ని నిబంధనలను సడలించినట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్ తెలిపారు. కార్డులో కొత్త సభ్యుల పేర్లను చేర్చడం, లేదా కొత్తగా కార్డుకు దరఖాస్తు చేయడానికి వివాహ సర్టిఫికెట్, ఫొటో ఉండాలన్న నిబంధనను సడలించామని చెప్పారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు గమనించాలని సూచించారు.

దివ్యాంగులకు ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ



సెంటర్ ప్రారంభిస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు, పేర్ల అప్పారావు తదితరులు

పెదగంట్యాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మన్, బీజేపీ గంగవరం శాఖ అధ్యక్షుడు పేర్ల అప్పారావు ఆధ్వర్యంలో గొడ్డువానిపాలెంలో దివ్యాంగుల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటైంది. ముఖ్యఅతిథులుగా గాజువాక నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరిసింగరావు, జనసేన నాయకుడు తిప్పల రమణారెడ్డి పాల్గొని శుక్రవారం ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఎంపిక చేసిన 25 మంది దివ్యాంగులకు 45 రోజుల పాటు కంప్యూటర్ కోర్సు, ఆఫీస్ అసిస్టెంట్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామని, వారికి వసతి, భోజనం సదుపాయాలు కల్పిస్తామని నిర్వాకులు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి వివిధ సంస్థల్లో ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

- అఖిలపక్ష నాయకులు పిలుపు

ఉక్కుటౌన్‌షిప్, మే 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 20న చేపట్టే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలిని అఖిలపక్ష కార్మిక నాయకులు పిలుపునిచ్చారు. బీసీ గేటు దగ్గర శుక్రవారం నిర్వహించిన సమ్మె ప్రచార కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు స్టీల్‌ప్లాంట్‌లో పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో అగనంపూడి జట్టు విజయం



వాలీబాల్ విజేతలతో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

అగనంపూడి, మే 16 (ఆంధ్ర జ్యోతి) : మరిడిమాంబ ఉత్సవాలను పురస్కరించుకొని లంకెలపాలెంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఆహ్వా నపు వాలీబాల్ పోటీల్లో అగనంపూడి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా జ్ఞాపికతో పాటు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, బల్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొని యాచకుడు మృతి

కూర్మన్నపాలెం,మే 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతుండగా లారీ ఢీ కొనటంతో ఓ యాచకుడు మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. కూర్మన్నపాలెం, వడ్లపూడి పరిసరాలలో గత కొద్ది కాలంగా తిరుగుతున్న బిచ్చగాడు కూర్మన్నపాలెం జంక్షన్లో శుక్రవారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా ఓ లారీ ముందు నుంచి వచ్చి ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకొన్న దువ్వాడ పోలీసులుపోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ధ్వజస్తంభం మాను ఊరేగింపు



ధ్వజస్తంభం మానును ఊరేగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 65వ వార్డు గరుడాద్రిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరాయం ఎదుట ధ్వజస్తంభం ఏర్పాటుకు ఆలయ నిర్మాణ, నిర్వహణ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఇందుకు సంబంధించిన సుమారు రెండు టన్నుల బరువున్న సొమ్మిద మానును శనివారం ఊరేగించారు. ఆలయ ఛైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఈ ఊరేగింపు జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణ, మంగళవాద్యాలతో గాజువాక బీసీ రోడ్డు నుంచి గరుడాద్రి వరకు ఈ మానుఊరేగించారు. త్వరలో ధ్వజస్తంభం ఏర్పాటు జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. ధ్వజస్తంభ దాతలు వాడపల్లి ప్రసాద్‌రాజు, లావణ్య, అప్పల నరసింహరాజు, అనూరాధ, ఆలయకమిటీ సభ్యులు మిత్తని అప్పలరెడ్డి, ఆడారి సూరిబాబు, గొరుసు రామలక్ష్మి తదితరులు ఊరేగింపులో పాల్గొన్నారు.

'వందే భారత్' హాల్ట్ కోసం వినతి



డీఆర్ఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఈశ్వర్

కూర్మన్నపాలెం,మే 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ-సికింద్రాబాద్‌ల మధ్య నడుస్తున్న వందేభారత్ రైలుకు దువ్వాడలో హాల్టు కల్పించాలని కోరుతూ డీఆర్ఎం లలిత్ బొహ్రను తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ శుక్రవారం కలసి వినతి పత్రం అందజేశారు. అలాగే వందే భారత్ రైలులో స్లీపర్ క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేయాలని, విశాఖ నుండి కొల్లాం, వారాణసి, షిర్డి, గాంధీగ్రామ్, చెన్నైలకు వెళ్లే వారాంతపు ప్రత్యేక రైళ్లను ప్రతిరోజూ నడపాలనీ, ప్రస్తుతం విశాఖ-తిరుపతి మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లో కేవలం 11 కోచ్‌లు మాత్రమే ఉండటం వలన థర్డ్,సెకెండ్ ఏసీ కోచ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.స్పందించిన డీఆర్ఎం వినతులను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పెందుర్తి రూరల్, మే16 (ఆంధ్రజ్యోతి): అనిల్ నీరుకొండ ఆసుపత్రి ఆధ్వర్యంలో చింతల అగ్రహారం గ్రామంలోని ఈరోజు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నాని సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు చెప్పారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రాత బాక్షి ముఖ్యఅతిథిగా శిబిరాన్ని ప్రారంభిస్తున్నారని చెప్పారు. అన్ని వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, చికిత్సలు చేసిన అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేస్తారని ఆయన చెప్పారు. బ్రిందా హాస్పిటల్, క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్‌ల ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహిస్తారని చెప్పారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

మల్కాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండల పరిధిలో ఉన్న పలు అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి కేవీ రామలక్ష్మి శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పలుసూచనలు చేశారు. గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరోగ్యానికి సంబంధించిన విషయాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కిశోర బాలికలకు పౌష్టికాహారం లోపం లేకుండా చూడాలని చెప్పారు. ఈ తనిఖీల కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఏడు వార్డుల అధ్యక్షుల నియామకాలు

మల్కాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో 40, 58 నుంచి 63 వార్డుల (59 వార్డు మినహా)టీడీపీ అధ్యక్షుల నియామకాలు జరిగాయి. 40వ వార్డు అధ్యక్షుడిగా గేదల రమణను, 58వ వార్డు అధ్యక్షుడిగా కోరాడ శ్రీనివాసరావును, 60వ వార్డు అధ్యక్షుడిగా మాత శ్రీనును, 61వ వార్డు అధ్యక్షుడిగా మజ్జి సోమేశ్‌ను, 62వ వార్డు అధ్యక్షుడిగా మజ్జి మాలినాయుడును, 63 వార్డు అధ్యక్షుడిగా జెర్రిపోతుల సరసింగరావును నియమించారు. 59వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా ఉరుకూటి హరిని దాదాపుగా ఖరారు చేసినట్టు తెలిసింది. అయితే ఈ నియమకాన్ని అధికారికంగా ప్రకటన కాలేదు. ఇటీవలే ఈ వార్డు అధ్యక్ష పదవి వివాదస్పదమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే గణబాబు ఈ వార్డుకు సంబంధించి ప్రకటన చేయలేదు. ఈరోజో, రేపో ఈ వార్డు అధ్యక్షుడిని ప్రకటిస్తారని వార్డులో టీడీపీ శ్రేణులు చెబుతున్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున మలేరియా సిబ్బంది

మల్కాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 పరిధి శ్రీహరిపురంలో మల్కాపురం ఏరియా మలేరియా విభాగం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా విభాగం ఉద్యోగులు శ్రీహరిపురం ప్రాంతంలలో ర్యాలీ నిర్వహించి, డెంగ్యూ సోకుండా పాటించాల్సిన జాగ్రత్తలుపై నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో మలేరియా విభాగం ఏడు వార్డుల ఇన్స్పెక్టర్ డి.రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో డెంగ్యూ పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏడాది మే 16న కేంద్ర ప్రభుత్వం డెంగ్యూ దినోత్సవం చేపడుతోందని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు సునీల్, నవరత్నం, రమేశ్, జిల్లా మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ భవాని, జీవీఎంసీ మలేరియా సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హై బీపీతో టెన్షన్..టెన్షన్..



సైలెంట్ కిల్లర్‌గా మారుతున్న హైపర్ టెన్షన్‌తో తీవ్ర ఇబ్బందులు

(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి)

అధిక రక్తపోటుతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గడిచిన కొన్నాళ్లుగా బీపీ రోగులు గణనీయంగా పెరుగుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు పది మందిలో ఒకరికి మాత్రమే ఈ సమస్య ఉంటే... ఇప్పుడు ప్రతి నలుగురిలో ఒకరు హై బీపీతో బాధపడుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం వంటి అనేక అంశాలు దీనికి కారణమవుతున్నాయి. ఏటా హైపర్ టెన్షన్ బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలనే ఉద్దేశంతో ఏటా మే 17న వరల్డ్ హైపర్ టెన్షన్ డే జరుపుతున్నారు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా ప్రత్యేకమైన థీమ్‌తో దీనిని నిర్వహిస్తున్నారు. 'బీపీని సరిగ్గా గుర్తించండి.. నియంత్రణలో ఉంచుకుని దీర్ఘకాలం జీవించండి' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.



- నానాటికీ భారీగా పెరుగుతున్న బాధితులు
- మారిన జీవనశైలే కారణమంటున్న వైద్య నిపుణులు
- శారీరక శ్రమ, మంచి ఆహారపు అలవాట్లతోనే బీపీ నియంత్రణ సాధ్యం

నేడు వరల్డ్ హైపర్ టెన్షన్ డే

భారీగా బాధితులు..

30 ఏళ్లు దాటిన ప్రతి నలుగురిలో ఒకరు హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో 20 ఏళ్లు దాటిన యుక్త వయస్కుల్లోనూ ఈ సమస్య కనిపిస్తున్నట్టు పేర్కొంటున్నారు. హైపర్ టెన్షన్ సైలెంట్ కిల్లర్‌గా మారుతుండడంతో ప్రజలను అప్రమత్తం చేసే ఉద్దేశంతో వందకుపైగా దేశాల్లో హైపర్ టెన్షన్ లీగ్ ఆధ్వర్యంలో ఈ డేను నిర్వహిస్తూ వస్తున్నారు. 2006 నుంచి ప్రతి సంవత్సరం ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

రక్తనాళాల్లో ఒత్తిడితో..

రక్తనాళాల్లో ఒత్తిడి కారణంగా అత్యధికులు హైబీపీ బారినపడుతున్నట్టు పలువురు వైద్యులు పేర్కొంటున్నారు. సాధారణంగా మనిషి తన జీవన యాత్రను సజావుగా సాగించాలంటే రక్తప్రసరణ వ్యవస్థ సక్రమంగా ఉండాలి. శరీరంలోని అన్ని అవయవాలకు రక్త సరఫరా నిరంతరం ఒకే విధంగా జరుగుతూ ఉండాలి. అయితే రక్త ప్రసరణ జరిగే క్రమంలో కలిగే ఒత్తిడి పరిధికి మించితే రక్తపోటుగా మారుతుంది. సాధారణంగా రక్త ప్రసరణ జరిగేటప్పుడు ప్రతి మనిషి రక్తపోటు 120/80 కంటే తక్కువగా ఉండాలి. ఒకవేళ అంతకంటే ఎక్కువగా ఉంటే దానిని అధిక రక్త పోటుగా పరిగణిస్తారు. 130/85 దాటితే రక్తపోటు వస్తున్నట్టుగా భావించాల్సి ఉంటుంది. 130-139/80-90 ఉంటే స్టేజ్-1 హైపర్ టెన్షన్‌గా భావించాల్సి ఉంటుంది. అలాగే, 140/90 ఉంటే స్టేజ్-2 హైపర్ టెన్షన్‌గా చెబుతారు. 180/120 ఉంటే హైపర్ టెన్సివ్ క్రైసిస్‌గా చెబుతారని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రాణాలను హరించే ముప్పు..

హైపర్ టెన్షన్ వల్ల ప్రాణాలను హరించే ముప్పు పొంచి ఉంటోందని నిపుణులు అంటున్నారు. ఓ వ్యక్తిని తనకు తెలియకుండానే మృత్యుఒడికి చేరుస్తుంది కాబట్టే దీన్ని సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు, నగరాల్లో ప్రతి నలుగురిలో ఒకరు హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్న వాళ్లే ఉన్నారు. నిత్యం ఉద్యోగంలో తలమునకలై ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల ముందుగా హైపర్ టెన్షన్ దరి చేరుతుందని నిపుణులు చెబుతున్నారు. హైపర్ టెన్షన్ బారినపడితే బ్రెయిన్ స్ట్రోక్స్, పెరాలసిస్ స్ట్రోక్స్, గుండెపోటు, కిడ్నీలు పాడవ్వడం వంటి రుగ్మతలన్నీ చుట్టుముట్టే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏటా ప్రపంచ వ్యాప్తంగా సుమారు ఎనిమిది మిలియన్ల మంది హైపర్ టెన్షన్ బారినపడి మృత్యువాత చెందుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



ఇవీ కారణాలు..

హైపర్ టెన్షన్ బారినపడేందుకు అనేక అంశాలు దోహదం చేస్తున్నాయి. ఫ్యామిలీ హిస్టరీ, జన్యుపరమైన కారణాలు, అదుపులేని శరీర బరువు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఆహారంలో అధికంగా ఉప్పు తీసుకోవడం, మద్యం తాగడం, పొగ తాగడం, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం లేకపోవడం, ఒకేచోట కూర్చుని ఎక్కువ సమయం పనిచేయడం, కనీస వ్యాయామం చేయకపోడం, పెయిన్ కిల్లర్, స్టెరాయిడ్స్ అధికంగా వాడడం, గర్భనిరోధక మాత్రలు అధికంగా వినియోగించే వాళ్లు ఈ సమస్య బారినపడే అవకాశం ఉంది.

గుర్తించడం ఎలా?

హై బీపీ పట్ల అవగాహన ఉన్నప్పుడే సకాలంలో గుర్తించడం సాధ్యమవుతుంది. 30 ఏళ్లు దాటిన వాళ్లు ఏడాదికొకసారి తప్పనిసరిగా బీపీ పరీక్ష చేయించుకోవాలి. కళ్లు తిరగడం, తల వెనక భాగంలో నొప్పి రావడం వంటి లక్షణాలుంటే అప్రమత్తం కావాలి. కిడ్నీ జబ్బులు, థైరాయిడ్, అడ్రినల్ వంటి జబ్బులున్నవాళ్లు తరచూ వైద్యుడి వద్దకు వెళ్లి పరీక్ష చేయించుకోవాలి.

జాగ్రత్తలతో చెక్..

హైపర్ టెన్షన్ బారినపడకుండా జీవన విధానంలో కొన్ని మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పోషకాహారాన్ని తీసుకోవడం, వారంలో కనీసం ఐదు రోజులపాటు కనీసం అర్థ గంట వ్యాయామం చేయడం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, ఆహారంలో ఉప్పు వినియోగాన్ని తగ్గించడం, ఏరోబిక్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం, ఉప్పు అధికంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం, ఫైబర్ అధికంగా ఉండే ఆకుకూరలు, పండ్లు తీసుకోవడం చేయాలి. యోగా, మెడిటేషన్ వంటివి కూడా ఉపయోగపడతాయి.

నిర్లక్ష్యంతోనే పెను ప్రమాదం



హైపర్ టెన్షన్ విషయంలో నిర్లక్ష్యం పనికిరాదు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే పెను ప్రమాదానికి దారి తీయవచ్చు. బీపీ ఒకసారి జీవితంలో వచ్చిందంటే తగ్గదు. కేవలం ఇది పెరగకుండా మాత్రమే చూసుకోవాలి. అధిక బీపీ వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. బీపీ వల్ల అనేక మంది హార్ట్ ఎటాక్‌కు గురై మృతి చెందుతున్నారు. బీపీని కేవలం మందులతోనే కాకుండా సరైన ఆహారపు అలవాట్లతో కూడా నియంత్రణలో ఉంచుకోవచ్చు. అధిక ఒత్తిడే తీవ్రమైన రక్తపోటుకు కారణమవుతుంది. తీవ్రమైన తల నొప్పి, ఛాతీ నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం, వాంతులు, అస్పష్టమైన దృష్టి లేదా ఇతర దృష్టి మార్పులు, ఆందోళన, గందరగోళం, చెవుల్లో శబ్దాలు, ముక్కు నుంచి రక్తస్రావం కావడం వంటివన్నీ హైపర్ టెన్షన్ లక్షణాలుగా గుర్తించాలి. ప్రజలకు ఈ వ్యాధి పట్ల అవగాహన లేకపోవడమే అనేక అనర్థాలకు కారణమవుతోంది. కాబట్టి అప్రమత్తతో వ్యవహరించడం ఎంతైనా మంచిది.

-డాక్టర్ అశ్విన్‌కుమార్ పాండా, కార్డియాలజిస్టు, మెడికవర్ ఆస్పత్రి

సుస్థిరత ఉద్యమంలో ఎంఎస్ఎంఈలదీ కీలక పాత్ర | మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): కొత్త వ్యాపారాల ప్రారంభం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాష్ట్రానికి వెన్నెముకగా ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ప్రపంచ సుస్థిరత ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయని ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ ఎంపవర్‌మెంట్ అండ్ రిలేషన్స్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. 'పచ్చదనం, దృఢమైన భవిష్యత్తు' అనే అంశంపై సీఐఐ విశాఖపట్నంలో శుక్రవారం నిర్వహించిన సుస్థిరత సదస్సు-2025కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ పునరుత్పాదక ఇంధనాలు, స్వచ్ఛ తయారీ, సర్క్యులర్ ఎకానమీ నమూనాలపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. రాష్ట్రంలో 20 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పలు ప్రాజెక్టులను చేపడుతున్నామన్నారు. గ్రీన్ టెక్నాలజీ వినియోగించేవారికి, పర్యావరణ హిత వ్యాపారాలు చేసేవారికి, సుస్థిర ఉత్పత్తులు రూపొందించే వారికి తక్కువ వడ్డీ రుణాలు, శిక్షణ వంటి సహాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ గ్రీన్ విశాఖ మిషన్‌లో భాగంగా నగరంలో పది లక్షల మొక్కల పెంపకాన్ని చేపడుతున్నామని, ఇందులో ఐదు లక్షల మొక్కలను విశాఖపట్నం పోర్టు ఇస్తుందని, మిగిలిన వాటిని కూడా ఇతర పరిశ్రమల నుంచి సేకరిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. తీర ప్రాంత పరిరక్షణకు రూ.200 కోట్లతో త్వరలో పనులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. గ్రీన్‌కో చీఫ్ సస్టెయినబులిటీ ఆఫీసర్ రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా క్లీన్ టెక్నాలజీ స్టార్టప్‌లకు సాయం అందించాలని కోరారు. క్లీన్ టెక్నాలజీలో రూ.కోటి పెట్టుబడి పెడితే పదేళ్లలో రూ.25 కోట్ల లాభం వస్తుందని, ఇది నిరూపితమైందన్నారు. సదస్సులో సీఐఐ రాష్ట్ర చైర్మన్ మురళీకృష్ణ గన్నమనేని, వైస్ చైర్మన్ నరేంద్రకుమార్, విశాఖ ఫార్మా సిటీ ఎండీ లాల్ కృష్ణ, విశాఖ సీఐఐ చైర్మన్ డీవీఎస్ నారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్. వేదికపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీఐఐ రాష్ట్ర చైర్మన్ మురళీకృష్ణ, గ్రీన్‌కో ప్రతినిధి రాంబాబు, తదితరులు

నేడు పెట్రోలియం వర్సిటీ ఐదో స్నాతకోత్సవం

» ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ డైరెక్టర్ శాలివాహన

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ విద్యార్థులకు ఐదో స్నాతకోత్సవాన్ని శనివారం హోటల్ నెవాటెల్‌లో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) డైరెక్టర్ శాలివాహన్ తెలిపారు. ఏయూలోని వర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

స్నాతకోత్సవంలో ఇద్దరు పీహెచ్‌డీ స్కాలర్లు, అప్లైడ్ జియాలజీలో 15 మంది ఎమ్మెస్సీ విద్యార్థులు, పెట్రోలియం ఇంజనీరింగ్‌లో 8 మంది విద్యార్థులకు, కెమికల్ ఇంజనీరింగ్ నుంచి 34 మంది బీటెక్ విద్యార్థులతో సహా 51 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. అకడమిక్ ఎక్సలెన్స్‌కు సంబంధించి ఒక్కో అకడమిక్ ప్రోగ్రామ్ నుంచి ఇద్దరు విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను అందజేస్తామన్నారు. అకడమిక్ సీజీపీఏ, ఎక్స్‌ట్రా కరిక్యులర్ విజయాల ఆధారంగా ఓవరాల్ ఎక్సలెన్స్‌కు ఉత్తమ విద్యార్థికి ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రపతి బంగారు పతకాన్ని అందిస్తామని పేర్కొన్నారు.

ఐఐపీఈ బోర్డు ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ వీకే బాసిక్ మాట్లాడుతూ ఈ స్నాతకోత్సవానికి హిందుస్థాన్ జింక్స్ సీఈవో అరుణ్ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. ఈ ఏడాది నుంచి బీటెక్ మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, ఎంటెక్ పెట్రోలియం ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. అలాగే ఈ సంవత్సరం నుంచే పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను కూడా ప్రారంభించనున్నట్టు వివరించారు. సమావేశంలో ఆర్అండ్ డీన్ ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్, అకడమిక్ అఫైర్స్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ హింగ్లు కాకతి, ఐఐపీఈ రిజిస్ట్రార్ రామ్ ఫాల్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శాలివాహన

మెడ్‌టెక్‌లో జోన్‌లో కెమికల్ రహిత గ్లౌజుల తయారీ

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని మెడ్‌టెక్ జోన్‌లో ప్రముఖ సర్జికల్ గ్లౌజుల తయారీ కంపెనీ ఎన్‌లీవా రసాయన రహితమైనవి తయారు చేసింది. సాధారణంగా ఆస్పత్రుల్లో, వివిధ శస్త్ర చికిత్సల సమయంలో కొన్ని రకాల గ్లౌజులను వినియోగిస్తుంటారు. వీటి ఫ్లెక్సిబిలిటీ తయారీలో కొన్ని రకాల కెమికల్స్‌ను వాడుతుంటారు. అయితే కెమికల్స్ వినియోగించని గ్లౌజులను అనేక ఆస్పత్రులు, వైద్యులు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ ఉంటారు. గత కొన్నాళ్లుగా కెమికల్ రహిత గ్లౌజులను వాడేందుకు వైద్యులు, ఆస్పత్రులు మొగ్గు చూపిస్తుండడంతో మెడ్‌టెక్ జోన్‌లోని ఎన్‌లీవా కంపెనీ ఆ దిశగా పరిశోధనలు సాగించి విజయం సాధించింది. ఈ మేరకు కెమికల్ రహిత గ్లౌజుల తయారీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టింది. కొద్దిరోజుల్లో తొలి దఫా ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ కెమికల్ రహిత గ్లౌజులు దేశంలోనే తొలి యాక్సిలేటర్ రహిత నైట్రైల్ గ్లౌజులుగా సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇవి చర్మాన్ని సురక్షితంగా ఉంచడంలో కీలకంగా వ్యవహరించడంతోపాటు అలర్జీ బారినపడకుండా చేతికి రక్షణ అందిస్తాయి. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అనిందిత్ రెడ్డి మాట్లాడుతూ కెమికల్ రహిత గ్లౌజులను మార్కెట్‌లోకి తీసుకువచ్చిన తొలి భారతీయ కంపెనీగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. నాలుగు రకాల వేరియంట్లలో వీటిని అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు.


ఎన్‌లీవా కంపెనీ తయారుచేసిన గ్లౌజులు

క్రైం... crime news

నా కుటుంబం పట్టించుకోవడం లేదు...

- చావే శరణ్యం
- ఆత్మహత్య చేసుకుంటానని వృద్ధుడి హెచ్చరిక
- పెందుర్తి మండలం జంగాలిపాలెంలో ఘటన
- పోలీసుల కౌన్సెలింగ్


వాటర్ ట్యాంక్‌పై వృద్ధుడు (సర్కిల్‌లో), రక్షించిన బ్లూకోట్ కానిస్టేబుల్ చంద్రశేఖర్

పెందుర్తి, మే 16(ఆంధ్రజ్యోతి): 'నాకుటుంబం నన్ను పట్టించుకోవడం లేదు. నా అనుకున్న వాళ్లే కాలదన్నారు. ఈ మనోవేదన భరించలేకపోతున్నా ఆత్మహత్యే శరణ్యం' అంటూ బోను సత్యం (62) అనే ఓ వృద్ధుడు పంచాయతీ వాటర్ ట్యాంక్ ఎక్కి హడావిడి చేశాడు. ట్యాంక్ పై నుంచే అతడు పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో బ్లూ కోట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సత్యాన్ని కాపాడారు. ఈ మేరకు సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు విజయనగరం జిల్లా కొత్త వలస మండలం చింతలపాలానికి చెందిన బోను సత్యం తన కుటుంబంతో ఉంటున్నాడు. తన భార్య, కూతురు, అల్లుడు కొంతకాలంగా మూకుమ్మడిగా వేధిస్తున్నారు. ఇటీవలే వీరి వేధింపులు శృతిమించడంతో సత్యం తీవ్ర మనోవేదన చెందాడు. శుక్రవారం పెందుర్తి మండలం సమీపం జంగాలిపాలెంలో ఉన్న పంచాయతీ వాటర్‌ట్యాంక్ ఎక్కి 'నేను చనిపోవాలనుకుంటున్నాను. నా కుటుంబం నన్ను కొంత కాలంగా వేధిస్తున్నారని మొత్తం కథను 112 నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే సీఐ స్పందించి బ్లూకోట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను పంపించారు. అతడు సత్యాన్ని మాటల్లో పెట్టి కిందకు దింపారు. అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, కౌన్సెలింగ్ ఇచ్చారు. కుంటుంబం నుంచి ఏదైనా సమస్య ఎదురైతే తమకు సమాచారం అందించమని పోలీసులు ధైర్యం చెప్పి పంపించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.1,62,500 విలువ గల 32.5 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో మహారాష్ట్రకు చెందిన లక్ష్మణ్ భండారీ (55), తిప్పెగారి బుగ్గమ్మ (41) అనే వ్యక్తులు విశాఖ మీదుగా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌పై న్యాయమూర్తికి ఖైదీ ఫిర్యాదు

- మానసిక వేధింపులకు గురి చేస్తున్నారంటూ అభియోగం
- ఆరోపణల్లో వాస్తవం లేదన్న జైలు సూపరింటెండెంట్
- ఫిర్యాదుదారుడు మావోయిస్టు సానుభూతిపరుడు

ఆరిలోవ, మే 16 (ఆంధ్రజ్యోతి) : తనపై మానసికంగా వేధింపులకు పాల్పడుతున్నారంటూ కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మావోయిస్టు ఖైదీ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబుపై జిల్లా కోర్టు న్యాయమూర్తికి ఫిర్యాదు చేసినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కేసు వాయిదా నిమిత్తం న్యాయమూర్తి ముందు గత సోమవారం ఖైదీని హాజరు పరచగా, ఆ సమయంలో న్యాయమూర్తికి జైలు సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన మావోయిస్టు సానుభూతిపరుడు నాగన్న కేంద్ర కారాగారంలో ఖైదీగా ఉన్నాడు. అతడిని ఈ నెల 5న వాయిదా నిమిత్తం జిల్లా న్యాయమూర్తి ముందు పోలీసులు హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో నాగన్న ఫిర్యాదు చేస్తూ.. జైలులో తనను సూపరింటెండెంట్ మహేశ్‌బాబు మానసికంగా వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేశాడు. తనను అనేక విధాలుగా వేధిస్తున్నారని, తనను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆరిలోవ పోలీసులకు న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్ర కారాగారంలో విచారణ చేపట్టినట్టు సీఐ తెలిపారు. కాగా, ఈ విషయమై జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రస్తావించగా, నాగన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నాగన్న మావోయిస్టు సానుభూతి పరుడని, అతడిపై సుమారు 10 కేసులు ఉన్నాయన్నారు. ఆయుధాల కేసు, మర్డర్ కేసు వంటి తీవ్ర కేసులు నమోదు ఉన్నాయన్నారు. ఈ నెల 4వ తేదీన నాగన్న ఉన్న బ్యారక్‌లోకి జైలు అధికారులతో వెళ్లి పరిశీలిస్తుండగా.. నాగన్న వద్ద బ్లేడ్‌లు, రేజర్లు గుర్తించామన్నారు. ఇవి ఎందుకు ఉన్నాయంటూ ఆరా తీశామన్నారు. ఈ కేంద్రకారాగారంలో సుమారు 32 మంది వరకు మావోయిస్టు సానుభూతి పరులు ఉన్నారని జైలు సూపరింటెండెంట్ తెలిపారు. వీరిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారని చెప్పారు.

పాయకరావుపేటలో గీతల సాలీడు!



విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పాయకరావుపేట చెక్‌పోస్టు సమీపంలోని దేవీనగర్‌లో ఒక ఇంటి గేటుపై గీతల సాలీడు కనిపించింది. శరీరంపై గీతలు ఉన్నందున దీనిని ఆ పేరుతోనే పిలుస్తారు. ఈ కీటకం ప్రమాదకరమైనది కాదని జంతుశాస్త్ర నిపుణుడు డాక్టరు ఎస్.ముకుంద రావు తెలిపారు. తోటలు, పొలాల్లో గీతల సాలీడు ఉంటుందని, నాలుగు నుంచి ఆరు మి.మీ. పొడవు ఉండే దీని జీవితకాలం సుమారు ఒక సంవత్సరమని పేర్కొన్నారు. గోధుమ/పసుపురంగుల్లో ఉండే గీతల సాలీడు పొలాలు, చెట్లపై ఉండే చిన్నచిన్న కీటకాలను ఆహారంగా తీసుకుంటుంది. ఇది రైతులకు మేలు చేస్తోందని ఆయన వివరించారు.

హెల్మెట్ వాడండి.. సీటు బెల్ట్ ధరించండి


బైక్‌కు తగిలించిన హెల్మెట్‌ను వాహనదారుడికి పెడుతున్న ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు

వాహనదారులు హెల్మెట్ వినియోగించడంలో, సీటు బెల్టు ధరించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంటారు. అనేకచోట్ల జరిగిన ప్రమాదాల్లో ఈ కనీస నిబంధనలు పాటించకపోవడం వల్లే ఎంతోమంది మృతి చెందడం, తీవ్రంగా గాయాలపాలవ్వడం చూస్తున్నాం. పోలీసులు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించి వాహనదారులకు వీటి పట్ల అవగాహన కల్పిస్తున్నా చాలామంది పట్టించుకోవడం లేదు. అయినప్పటికీ పోలీసులు మాత్రం ఈ విషయాలను పదేపదే వాహనదారులకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు శుక్రవారం హనుమంతవాక వద్ద వాహనదారులకు సీటు బెల్టు పెట్టుకోవాలని, హెల్మెట్ ధరించాలంటూ వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ఉన్నా పెట్టుకోకుండా బైక్ వెనక తగిలించి వెళుతున్న వాహనదారులను ఆపి మరీ హెల్మెట్ పెట్టుకోవాలని ఆయన సూచించారు. అలాగే కారుపై వెళుతూ బెల్టు పెట్టుకోని వారిని కూడా ఆపి బెల్టు పెట్టుకోవాలని హితవు పలికారు. నిబంధనలను పాటించకపోవడం వల్ల జరిగే ప్రమాదాలు, నష్టాలను వాహనదారులకు ప్రసాదరావు వివరించారు.

-విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి